http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

ఆదివారం 4 అక్టోబర్ 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5    వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad



## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828


## వాయుసేనకు ప్రతి ఏటా 36- 40 విమానాలు అవసరం



- ఫైటర్ స్క్వాడ్రన్ల సంఖ్య తగ్గిపోవడంపై ఐఏఎఫ్ చీఫ్ ఏపీ సింగ్ ఆందోళన
- దేశ సైనిక బలం విషయంలో వాయుసేన చాలా కీలకమని వెల్లడి
- ఏఐ ద్వారా ఎయిర్‌ఫోర్స్‌ను బలోపేతం చేస్తామని ప్రకటన
- "అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఐదో తరం ఫైటర్ ప్రోగ్రామ్‌లో జాప్యం జరిగితే మనం ఇతర ప్రత్యామ్నాయాలకు మళ్లాల్సి ఉంటుంది.

# ఆస్పత్రుల నిర్మాణాల్లో వేగం పెంచండి

- విద్యా, వైద్యంపై జిల్లాల వారీగా ప్రతి వారం సమీక్షించాలి
- డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్..
- ఆస్పత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది నియామకాలు పూర్తి చేయాలని మార్గనిర్దేశం
- విద్య, వైద్య శాఖలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలల్లో సౌకర్యాల కల్పనపై అధికారులకు దిశానిర్దేశం
- సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయాలి
- గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడుల విషయంలో పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలి



హైదరాబాద్

విద్యా, వైద్యంపై జిల్లాల వారీగా అధికారులు ప్రతి వారం సమీక్షించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో విద్యా, వైద్యంపై సీఎంవో అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. నిర్మాణంలోని ప్రధాన ఆస్పత్రులపై సీఎం ఆరా తీశారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రుల పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణం వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆస్పత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది నియామకాలు పూర్తి చేయాలని మార్గనిర్దేశం చేశారు. వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను ముందుగానే గుర్తించాలని సీఎం సూచించారు. అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలును వేగవంతం చేయాలని నిర్దేశించారు. ఆయా ఆస్పత్రులు పూర్తయ్యే నాటికి అన్ని వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లను అధికారులు - మిగతా3లో

## కళ్యాణ లక్ష్మి పథకం స్థానంలో..

# బంగారం




- 'తులం బంగారం' పథకం అమలుకు ప్రభుత్వం లైన్ క్లియర్..!
- తులం బంగారం పథకం అమలుకు రేవంత్ సర్కార్ సిద్దమవుతున్నట్లు తెలుస్తోంది
- ఈ స్కీమ్ ఎప్పుడెప్పుడు అమలు చేస్తారా? అని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి
- దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం మొదలుపెట్టాలని భావిస్తోంది
- దసరా సందర్భంగా ఈ స్కీమ్ ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్దమైంది



## అంతా బాగుందనుకుంటే ప్రమాదమే..

- రానున్న ఆర్థిక సవాళ్లపై ఆర్‌బీఐ గవర్నర్ వార్నింగ్
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోందన్న ఆర్‌బీఐ గవర్నర్
- ఆర్థిక ముప్పులపై ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్న మల్హోత్రా
- ప్రపంచ దేశాల మధ్య విభేదాలు పెరుగుతున్నాయని వెల్లడి
- వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు ప్రభావం చూపుతున్నాయని ప్రకటన
- ఆర్థిక సమస్యలు ఒక్కసారిగా బయటపడొచ్చని హెచ్చరిక

# ప్రయాణికులకు ఎంతో సౌకర్యం

- మెట్రోలో మంత్రుల బృందం
- బేగంపేట నుంచి జూబ్లీ చెక్‌పోస్ట్ వరకు ప్రయాణం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు మెట్రోలో ప్రయాణం
- కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఉమ్మడి పాస్ విశేషాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయాణించినట్లు మంత్రుల బృందం తెలిపింది.



హైదరాబాద్

హైదరాబాద్ మెట్రోలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ప్రయాణించారు. నగర ప్రయాణికుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మెట్రో-ఆర్టీసీ కామన్ పాస్ విశేషాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మంత్రుల బృందం బేగంపేట నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వరకు ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులపై ఆర్థిక భారం పడకుండా కాంబో పాస్ తీసుకొచ్చినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌తో ప్రయాణం మరింత సులభమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మెట్రో, ఆర్టీసీ సేవల సమన్వయంతో ప్రయాణికులకు ఎంతో సౌకర్యమని తెలిపారు. మెట్రో దిగిన తర్వాత బస్సు కోసం ప్రయాణికులకు ఇక అయోమయం ఉండదన్నారు. ఒకే పాస్‌తో మెట్రో, ఆర్టీసీ ప్రయాణం ప్రయాణికులకు సౌకర్యవంతమైన విధానమని ఆయన కొనియాడారు. కామన్ పాస్ చాలా మంచి, అనుకూలమైన - మిగతా3లో



## ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నీటి కొరత

- తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- యాసంగిలో తక్కువ నీటితో పండే పంటల వైపు రైతులు మళ్లాలని సూచించారు.
- పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును అన్నదాతలు ప్రోత్సహించాలి
- రైతు నేస్తం 109వ ఎపిసోడ్‌లో రబీ విత్తన పంపిణీని ప్రారంభిస్తాం
- కొన్ని రకాల విత్తనాలకు వందశాతం సబ్సిడీ..

హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నీటి కొరత ఉందని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. యాసంగిలో తక్కువ నీటితో పండే పంటల వైపు రైతులు మళ్లాలని సూచించారు. స్వల్పకాలిక.. తక్కువ పెట్టుబడి పంటలను ఎంచుకోవాలని నిర్దేశించారు. శనివారం సచివాలయంలో మీడియాతో మంత్రి తుమ్మల మాట్లాడారు. పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును అన్నదాతలు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. రైతు నేస్తం 109వ ఎపిసోడ్‌లో రబీ విత్తన పంపిణీని - మిగతా3లో

## ఆ ఎన్నికలన్నీ చట్టవిరుద్ధమే



- లోక్‌సభ, అసెంబ్లీలను రద్దు చేయాలి'
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సంచలన డిమాండ్
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంచలన ఆరోపణలు
- దేశంలో అన్ని ఎన్నికలు చట్టవిరుద్ధంగానే నిర్వహిస్తున్నారని వ్యాఖ్యలు
- లోక్‌సభ, అసెంబ్లీలను రద్దు చేసి బ్యాలెట్ పేపర్ పద్ధతిలో మళ్లీ ఎన్నికలు జరపాలని డిమాండ్

## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు



- చివరి నిమిషంలో కీలక నిర్ణయం!
- తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్
- మెదక్, కరీంనగర్‌లో పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- షెడ్యూల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- నిరాశలో బీజేపీ శ్రేణులు



## దేశవ్యాప్త నిరసనలను ఒకే వేదికపైకి తెచ్చేందుకు రాహుల్ శ్రీకారం

- 'సత్యాగ్రహ' డిజిటల్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం
- కీలక నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- దేశవ్యాప్త నిరసనలను ఒకే వేదికపైకి తెచ్చేందుకు సత్యగ్రహ డిజిటల్ ప్లాట్‌ఫామ్ స్టార్ట్
- ఒంటరిగా వినిపించే గొంతుక అణిచివేతకు గురవుతుంది : రాహుల్

# 'ఆ ఎన్నికలన్నీ చట్టవిరుద్ధమే

'సర్' ప్రక్రియ కేంద్రంగా దేశంలో ప్రస్తుతం రాజకీయ పరిణామాలు హాట్ టాపిక్‌గా మారాయి. కేంద్ర ఎన్నికల సంఘంలో సభ్యుల మధ్య అభిప్రాయ భేదాల అంశం, సర్ ప్రక్రియలో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తాజాగా సంచలన ఆరోపణలు చేశారు. దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియపై మాట్లాడిన ఆయన– దేశంలో అన్ని ఎన్నికలు చట్టవిరుద్ధంగానే జరిగాయని ఆరోపించారు. ఈ క్రమంలో లోక్‌సభతో పాటుగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను రద్దు చేసి మళ్లీ కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ఈవీఎం పద్ధతిలో కాకుండా ఇప్పుడు బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. శనివారం రోజు కర్ణాటక కలబురగిలో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సహా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఎన్నికలపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. 'ప్రస్తుతం దేశమంతా చట్టవిరుద్ధంగా నిర్వహించే ఎన్నికల ఆధారంగానే నడుస్తోంది. మోదీ అక్రమంగా ఎన్నికైన ప్రధాని. అమిత్ షా చట్టవిరుద్ధంగానే ఎన్నికైన మంత్రి. ఎక్కడ ఎన్నికైన ముఖ్యమంత్రులైనా సరే, వారంతా ఇలానే చట్టవిరుద్ధంగా ఎన్నికైనవారే. వారందరినీ తొలగించి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి. ఆ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ల ద్వారా నిర్వహించాలి.' దేశంలో ఎక్కడ ఎన్నికలు నిర్వహించినా ఈవీఎంల దుర్వినియోగం తీవ్ర స్థాయిలో జరుగుతుందని ఖర్గే మండిపడ్డారు. అధికార పార్టీకి చెందిన నేతలే స్వయంగా ఇది చెబుతున్నారని అన్నారు. అధికార బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు వార్డులు, పంచాయతీలు, గ్రామాలకు వెళ్లి ఎక్కువగా పేదలు, గిరిజనులు, దళితులు, మైనార్టీల ఓట్లను



కావాలని తొలగిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. సెప్టెంబర్ 30న జరిగిన ఇండియా కూటమి సమావేశాన్ని కూడా ఖర్గే ఈ సందర్భంగా ప్రస్తావించారు. అక్కడ దాదాపు 20 పార్టీల ప్రతినిధులు, ఆయా పార్టీలకు చెందిన లీగల్ సెల్ ప్రతినిధులు పాల్గొనగా, సర్ ప్రక్రియ దేశానికి నష్టం కలిగించేలా సాగుతోందని ప్రతి ఒక్కరూ అంగీకరించినట్లు చెప్పారు.

సర్ ప్రక్రియలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని, ఇది ప్రజాస్వామ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని ఖర్గే వ్యాఖ్యానించారు. ప్రతి పోలింగ్ బూత్‌కు దాదాపు 500 ఓట్ల వరకు తొలగిస్తూ, తమకు అనుకూలమైన వారి పేర్లను కూడా చేరుస్తున్నారని ఖర్గే విమర్శించారు. ఇలా జరిగితే అది నిష్పక్షపాతంగా నిర్వహించిన ఎన్నిక ఎలా అవుతుందని ఖర్గే ప్రశ్నించారు. గతంలో ప్రధానులుగా పనిచేసిన జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి, పీవీ నరసింహారావు, రాజీవ్ గాంధీ కూడా ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు ఎన్నడూ పాల్పడలేదని చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే దేశంలో ఎన్నికల ప్రక్రియ, సర్ ప్రక్రియపై ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగుతాయని ఖర్గే తెలిపారు.

అక్టోబర్ 6న దిల్లీలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీ నిర్వహిస్తారని స్పష్టం చేశారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి, ప్రతి 3-4 రోజులకు ఓసారి ప్రచారాలు, నిరసనలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. 2023లో ప్రవేశపెట్టిన ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లు నియామక చట్టంపైనా ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (జజీ×) తొలగించి ఆ స్థానంలో కేంద్ర మంత్రిని చేర్చడం ద్వారా తమకు అనుకూలమైన వ్యక్తులనే నియమించుకుంటున్నారని విమర్శించారు.

**జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయడమే తెలివైన పని: పి. చిదంబరం**

ఇక సర్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చుట్టూ వివాదం మరింత ముదురుతోంది. ఈ క్రమంలో ఆయన రాజీనామా చేయడం మినహా మరో మార్గం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం అన్నారు. ప్రతిపక్షాల ఒత్తిడి కారణంగా సీఈసీ ఏదో ఒక రోజు వైదొలగాల్సిందేనని, కాబట్టి తక్షణమే రాజీనామా చేయడమే తెలివైన నిర్ణయం అని స్పష్టం చేశారు. లేకపోతే తమ నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. సర్ నిర్వహణలో ఎన్నికల కమిషనర్లకు చట్టవిరుద్ధమైన ఆదేశాలు ఇచ్చారని చిదంబరం మండిపడ్డారు. ప్రస్తుతం సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తున్నామని, ఇతర కమిషనర్ల పాత్రపై అనుమానాలు వచ్చినా, ఆధారాలు లభించినా వారి రాజీనామాపై కూడా పోరాటం చేస్తామని తెలిపారు.

# వాయుసేనకు ప్రతి ఏటా 36- 40 విమానాలు అవసరం

దేశ సైనిక బలం విషయంలో వాయుసేన చాలా కీలకమని భారత వైమానికదళ అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ తెలిపారు. దేశానికి ప్రతి ఏటా 36-40 విమానాలు అవసరమని అన్నారు. ప్రణాళిక ప్రకారం పనులు జరిగితే ఈ ఆర్థిక సంవత్సరంలోనే మల్టీరోల్ ఫైటర్ జెట్ ఒప్పందం ఖరారు కావొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ధరల చర్చలు, ఇతర కీలక అంశాలపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని వివరించారు. అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రోగ్రామ్‌లో జాప్యం జరిగితే వైమానిక దళం మరో ప్లాట్‌ఫామ్‌ను కొనుగోలు చేయాల్సి రావొచ్చని అభిప్రాయపడ్డారు. దిల్లీలో జరిగిన ఐఏఎఫ్ వార్షిక మీడియా సమావేశంలో ఏపీ ఏపీ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. "అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఐదో తరం ఫైటర్ ప్రోగ్రామ్‌లో జాప్యం జరిగితే మనం ఇతర ప్రత్యామ్నాయాలకు మళ్లాల్సి ఉంటుంది. రష్యా సు-57ను ప్రతిపాదించింది. కానీ దానిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సకాలంలో విమానాల అప్పగింత, కార్యాచరణ సామర్థ్యాన్ని నిర్ధరించడానికి అన్ని ప్రధాన విమాన ప్రోగ్రామ్‌లను 'సమగ్ర దేశ విధానం' ద్వారా చేపట్టాల్సిన అవసరం ఉంది. వాయుసేన వద్ద ఉన్న విమానాల సంఖ్యను పెంచుకోవాలనుకుంటున్నాం. ఐఏఎఫ్‌ను ఆధునీకరిస్తాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా భారత వైమానిక దళాన్ని బలోపేతం చేస్తాం. ఏఐ ఆధారిత వాయుసేన ఉండాలి. మొత్తం పోరాట సంసిద్ధతకు రక్షణ రంగంలో స్వయం సమృద్ధి చాలా కీలకం"

**స్మిత్ మచ్చర్‌పై ప్రశంసలు**

షైదుబాయ్ హీరో కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై ఏపీ సింగ్



ప్రశంసలు కురిపించారు. విమానంలో స్మిత్ మచ్చర్ అసాధారణమైన శారీరక, మానసిక ధైర్యాన్ని ప్రదర్శించారని కొనియాడారు. ప్రత్యేక డ్రోన్ దళాన్ని ఏర్పాటు చేయాలని తాము ఇంకా నిర్ణయించలేదని ప్రకటించారు. భారత వైమానిక దళం విషయంలో డ్రోన్లు అనేవి విప్లవాత్మక మార్పును తెచ్చేవి కావని, అవి క్రమంగా జరుగుతున్న పరిణామంలో భాగం మాత్రమేనని చెప్పారు. తాము డ్రోన్లు, లోయిటరింగ్ మ్యునిషన్స్ (లక్ష్యం వద్ద వేచి ఉండి దాడి చేయగల ఆయుధాలు) సంఖ్యను వైమానిక దళంలో పెంచుతున్నామని వివరించారు. వీటికి ప్రత్యేకమైన డ్రోన్ దళం అవసరమని తాను భావించడం లేదన్నారు. ఆధునిక సైనిక కార్యకలాపాల్లో మానవ రహిత వైమానిక వ్యవస్థలు (ఖూూా), లోయిటరింగ్ మ్యునిషన్స్ వినియోగం పెరుగుతున్న తరుణంలో ఐఏఎఫ్ చీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

"భారత వైమానిక దళానికి డ్రోన్లు విప్లవాత్మకం కాదు. అవి కేవలం పరిణామక్రమంలో వస్తున్న మార్పులు. ప్రత్యేక డ్రోన్ దళాన్ని ఏర్పాటు చేయం. డ్రోన్లు, లోటరింగ్ మ్యూనిషన్స్ విడివిడిగా కాకుండా ఇతర ఆయుధాలు, ప్లాట్‌ఫారమ్‌లతో కలిసి సమన్వయంగా పనిచేసినప్పుడే ఎక్కువ ప్రభావం చూపుతాయి. వైమానిక దళంలో డ్రోన్లు, లోయిటరింగ్ మ్యూనిషన్స్ సంఖ్యను పెంచుతున్నాం. వాయుసేనకు ప్రత్యేక డ్రోన్ దళం అవసరం లేదు. అవి ఒకే వ్యవస్థలో భాగంగా ఉండాలి. వాయుసేనలో డ్రోన్ సామర్థ్యాలు గత కొన్నేళ్లుగా ఉన్నాయి. ప్రస్తుతం వాటి సంఖ్యను, రకాలను, సామర్థ్యాలను మాత్రమే విస్తరిస్తున్నాం. ప్రత్యేక డ్రోన్ దళం కంటే ప్రస్తుత వాయుసేన వ్యవస్థలోనే డ్రోన్లు భాగం కావాలని, అప్పుడే సమష్టిగా ఆపరేషన్లు నిర్వహించడం సాధ్యమవుతుంది" అని తెలిపారు.

**నీట్ యూజీ రీ-టెస్ట్ గురించి ఏమన్నారంటే?**

నీట్ యూజీ రీ-టెస్ట్‌కు సంబంధించిన ప్రశ్నపత్రాలను చేరవేసే బాధ్యతను ఐఏఎఫ్ చేపట్టడంపైనా ఏపీ సింగ్ స్పందించారు. ఏదైనా ప్రక్రియలో మనం (ఐఏఎఫ్) సాయం అవసరమైతే తప్పకుండా చేయాలని అన్నారు. ఆ పని ఏమిటన్నది ముఖ్యం కాదన్నారు. కాగా, జూన్ 21న జరిగిన నీట్ యూజీ రీ-టెస్ట్‌కు సంబంధించిన రవాణా, ఇతర నిర్వహణ బాధ్యతలను భారత వైమానిక దళం చేపట్టింది. ఈ క్రమంలో ఐఏఎఫ్ చీఫ్ ఏపీ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత వైమానిక దళం వద్ద ఉన్న విమానాల సంఖ్య తగ్గుతోంది. ప్రణాళికాబద్ధమైన విమానాల చేర్పులలో జాప్యం ఐఏఎఫ్‌ను ప్రభావితం చేసింది. ప్రస్తుత, ఊహించిన అంతరాలను పూడ్చడానికి ఐఏఎఫ్ తేజస్ మార్క్-1ఏ, మల్టీ రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ (వీ=ఖీూా), ఫ్యూచర్ మార్క్-2 ఫైటర్ వంటి ప్లాట్‌ఫారమ్‌ల వైపునకు చూస్తోంది" అని ఏపీ సింగ్ పేర్కొన్నారు.

# దేశవ్యాప్త నిరసనలను ఒకే వేదికపైకి తెచ్చేందుకు రాహుల్ శ్రీకారం

దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలను ఒకే వేదికపైకి తెచ్చి, వాటికి మద్దతు కూడగట్టే లక్ష్యంతో రూపొందించిన 'సత్యాగ్రహ' అనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ శనివారం ప్రారంభించారు. దేశంలో వివిధ రకాల అన్యాయాలపై పోరాడుతున్న పౌరులు తమ పోరాట గాథలను, నిరసనల వివరాలను ఈ వేదిక ద్వారా పంచుకోవాలని కోరారు. అలాగే జాతిపిత మహాత్మా గాంధీ సిద్ధాంతాన్ని ప్రస్తావించారు. సత్యాగ్రహం అనేది ఒక శక్తివంతమైన ఆయుధమని అభివర్ణించారు. అయితే సత్యం వైపు ఐక్యంగా నిలబడటం అంతకంటే గొప్ప ఆయుధమని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో రాహుల్ పోస్ట్ పెట్టారు. దేశవ్యాప్తంగా ప్రజలు తమ హక్కుల కోసం పోరాడుతున్నారని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. "తరచుగా ప్రజలు తమకు జరిగిన అన్యాయం, హక్కులపై ఒంటరిగానే పోరాడుతున్నారు. జెన్‌జీ (యువత), విద్యార్థులు, రైతులు, గిరిజనులు, దళితులు, మహిళల ప్రతి పోరాటానికి ఒక ప్రత్యేకమైన కథ ఉంది. అయితే ఒంటరిగా వినిపించే గొంతుక తరచుగా అణచివేతకు గురవుతుంది. ఈ గొంతుకలన్నింటినీ ఒక మ్యాప్‌పై ఏకం చేసే ప్రయత్నమే 'సత్యాగ్రహ' డిజిటల్ ప్లాట్‌ఫామ్. సత్యమే అంతిమ ఆయుధమని బాపు (మహాత్మా గాంధీ) మనకు బోధించారు. కానీ సత్యం కోసం ఐక్యంగా నిలబడటమే అంతకంటే గొప్ప ఆయుధం" అని రాహుల్ పేర్కొన్నారు.

**'రెండు నిమిషాలు కేటాయించండి చాలు'**

"మీరు (దేశ ప్రజలనుద్దేశించి) కూడా ఏదైనా అన్యాయంపై పోరాడుతుంటే మీ పోరాట గాథను పంచుకోండి. అందుకు కేవలం రెండు నిమిషాల సమయమే పడుతుంది. నిరసనకారులు తమ పోరాటానికి గల కారణాలు ఈ



ప్లాట్‌ఫామ్‌లో సమర్పించవచ్చు. ఇంటరాక్టివ్ మ్యాప్ ద్వారా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఇలాంటి ఉద్యమాలను గుర్తించవచ్చు. ప్రజల ప్రత్యక్ష మద్దతును పొందొచ్చు. మీ పోరాట గాథ మ్యాప్‌లో కనిపిస్తుంది. మీలాగే ఇంకా ఎవరు అన్యాయంపై పోరాడుతున్నారో మీరు చూడొచ్చు. అన్యాయాలపై, ప్రజా హక్కులపై ప్రతిపక్ష నాయకుడిగా పార్లమెంట్‌లో, దేశ వీధుల్లో, లేఖలు రాయడం ద్వారా పోరాటం చేస్తాను. ప్రజలకు అండగా నిలిచేందుకు కృషి చేస్తాను. అది నా బాధ్యత."

**నిరసనల సమాచారమంతా ఒకే చోట : రాహుల్ గాంధీ**

దేశవ్యాప్తంగా ద్రవ్యోల్బణం, రైతుల సమస్యలు, మహిళల భద్రత వంటి వివిధ అంశాలపై జరుగుతున్న నిరసనల నేపథ్యంలో సామాన్య ప్రజల కోసం సత్యాగ్రహ వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు రాహుల్ గాంధీ తెలిపారు. దేశంలోని ప్రతి మూలన నిరసనలు జరుగుతున్నాయని ఆరోపించారు. కొందరు విద్యార్థుల గురించి, మరికొందరు మహిళల గురించి, ఇంకొందరు ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్నారని అన్నారు. ఇలా దేశవ్యాప్తంగా లక్షలాది రకాల నిరసనలు జరుగుతున్నాయని మండిపడ్డారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఈ నిరసనలన్నింటికి సంబంధించిన సమాచారాన్ని ఒకే చోట క్రోడీకరించాలని తాను భావించానని చెప్పారు. అందుకే నిరసనలు తెలుపుతున్న ప్రజల కోసం సత్యాగ్రహ వెబ్‌సైట్‌ను ప్రారంభించానని చెప్పారు. ప్రజల నిరసన ఏదైనా అది దేని గురించో సంబంధించిన వివరాలను ఈ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని పిలుపునిచ్చారు.

**కేంద్రంపై రాహుల్ ఫైర్**

శుక్రవారం నాడు ఎస్ఐఆర్ ప్రక్రియ, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు రాహుల్ గాంధీ. జ్ఞానేశ్ కుమార్ త్వరగానే వెళ్లిపోతారని, ఆయనను ఆ పదవిలో కూర్చోబెట్టిన వ్యవస్థ కూడా వెళ్లిపోతుందని వ్యాఖ్యానించారు. వేలాది మంది యువత ఓట్ చోరీకి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసేందుకే రోడ్లపైకి వచ్చారని తెలిపారు. వారు తమ రాజ్యాంగ హక్కులను వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. కానీ నరేంద్ర మోదీ- అమిత్ షా ప్రభుత్వం ఏం చేస్తుంది? అబ్బాయిలు, అమ్మాయిల్ని వీధుల నుంచి ఈడ్చుకెళ్తోందని మండిపడ్డారు. ఓట్ చోరీపై ప్రశ్నించడమే యువత చేసిన నేరమా? అని ప్రశ్నించారు.

## అంతా బాగుందనుకుంటే ప్రమాదమే..



ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు, సాంకేతిక మార్పులు, వాతావరణ మార్పులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక ముప్పుల విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోవిడ్ తర్వాత ప్రపంచం ఎన్నో ఆర్థిక, ఇతర సంక్షోభాలను ఎదుర్కొందని మల్హోత్రా తెలిపారు. అయినా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాటిని తట్టుకుని నిలబడిందన్నారు. భారత్‌లోనూ చాలాకాలంగా ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని చెప్పారు. అయితే ఇదే స్థిరత్వం మరో సమస్యకు దారి తీయొచ్చని ఆయన హెచ్చరించారు. చాలాకాలం ఎలాంటి పెద్ద సంక్షోభం రాకపోతే గతంలో ఎదురైన సమస్యలను ప్రజలు, సంస్థలు మర్చిపోతారని అన్నారు. దీంతో ఎక్కువ రిస్క్ తీసుకోవడం, భారీగా అప్పులు చేయడం పెరిగే అవకాశం ఉందని చెప్పారు.

**ఒక్కసారిగా సమస్యలు రావొచ్చు**

బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో సమస్యలు ఒక్కసారిగా బయటపడే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. అయితే వాటిని పూర్తిగా పరిష్కరించడానికి మాత్రం చాలా సమయం పడుతుందని చెప్పారు. అందుకే పరిస్థితులు బాగున్న సమయంలోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గతంలో నడిపించిన విధానాల్లో ఇప్పుడు మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక విభేదాలు పెరుగుతున్నాయని చెప్పారు. వాణిజ్య ఆంక్షలు, సరఫరా అంతరాయాలు కూడా తరచూ ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ మార్పులన్నీ ఒకదానితో ఒకటి కలిసి ప్రభావం చూపుతున్నాయని మల్హోత్రా అన్నారు. అందువల్ల కేంద్ర బ్యాంకులు కేవలం ద్రవ్యోల్బణం, ఆర్థిక స్థిరత్వంపైనే దృష్టి పెట్టకుండా ప్రపంచ పరిణామాలను కూడా గమనించాలని సూచించారు.

## అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు. షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## మమతా బెనర్జీకి మరో షాక్

**రెండు పార్లమెంటరీ కమిటీల ఛైర్మన్ పదవులను కోల్పోయిన టీఎంసీ**



బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. పార్టీలో చీలిక, అగ్రనేతలపై దాడులు, అలాగే కీలక నేతల రాజీనామాలతో సతమతమవుతున్న తృణమూల్‌కు తాజాగా మరో ఎదురుదెబ్బ తగిలింది. రెండు కీలక పార్లమెంటరీ కమిటీల ఛైర్మన్ పదవులను తృణమూల్ కాంగ్రెస్ కోల్పోయింది. రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శనివారం నాడు వివిధ శాఖలకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలను పునర్వ్యవస్థీకరించడంతో ఈ ఎదురుదెబ్బ మమతా పార్టీకి తగిలింది. వాణిజ్య వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్‌గా టీఎంసీకి చెందిన డోలా సేన్ స్థానంలో బీజేపీ నేత సుధాన్షు త్రివేది నియమితులయ్యారు. అలాగే రసాయనాలు, ఎరువుల కమిటీ ఛైర్మన్‌గా టీఎంసీలోని అసమ్మతి వర్గానికి చెందిన కకోలి ఘోష్ దస్తీదార్ ఎంపికయ్యారు. టీఎంసీ నేత కీర్తి ఆజాద్ స్థానంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. పరిశ్రమల కమిటీకి తిరుచి శివ (డీఎంకే), ఆహారం, వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ కమిటీకి కె. కనిమొళి (డీఎంకే) మరోసారి ఛైర్మన్లుగా నియమితులయ్యారు. బీజేపీ మిత్రపక్షాలైన జేడీయూ, శివసేన, తెదేపాలకు చెందిన నాయకులు కూడా వివిధ పార్లమెంటరీ కమిటీల అధిపతులుగా కొనసాగుతున్నారు.

**కమిటీలకు ఛైర్మన్లుగా కాంగ్రెస్ సీనియర్ నేతలు**

కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ విదేశీ వ్యవహారాల కమిటీ ఛైర్మన్‌గా, మరో అగ్రనాయకుడు చరణ్‌జిత్ సింగ్ చన్నీ వ్యవసాయ కమిటీ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. విద్య, మహిళలు, పిల్లలు, యువజన వ్యవహారాల కమిటీకి హస్తం పార్టీ నాయకుడు ముకుల్ వాస్నిక్, అలాగే ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ కమిటీకి సమాజ్‌వాదీ పార్టీ నేత రామ్ గోపాల్ వర్మ ఛైర్మన్లుగా ఉన్నారు. రక్షణ శాఖ కమిటీకి బీజేపీకి చెందిన రాధా మోహన్ సింగ్ నేతృత్వం వహిస్తున్నారు. రవాణా, టూరిజం, సాంస్కృతిక కమిటీ ఛైర్మన్‌గా జేడీయూకి చెందిన సంజయ్ కుమార్ ఝా తిరిగి నియమితులయ్యారు. ఇంధన శాఖ కమిటీ అధిపతిగా శివసేనకు చెందిన శ్రీరంగ బర్నే కొనసాగుతున్నారు. ప్రజా ఫిర్యాదులు, న్యాయం, చట్టం కమిటీ ఛైర్మన్‌గా కమలం పార్టీ నాయకుడు సుజీత్ కుమార్ నియమితులయ్యారు. గతంలో ఈ కమిటీ ఛైర్మన్‌గా బీజేపీ ఎంపీ బ్రిజ్ లాల్ ఉండేవారు. బొగ్గు, గనులు, ఉక్కు శాఖ కమిటీ అధిపతిగా మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తిరిగి నియమితులయ్యారు. జలవనరుల కమిటీ ఛైర్మన్‌గా బీజేపీకి చెందిన రాజీవ్ ప్రతాప్ రూడీ కొనసాగుతున్నారు. కమలం పార్టీ నేత భర్తృహరి మహతాబ్ ఆర్థిక వ్యవహారాల కమిటీకి అధిపతిగా కొనసాగుతుండగా, అదే పార్టీకి చెందిన రాధా మోహన్ దాస్ అగర్వాల్‌ను హోం వ్యవహారాల కమిటీ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. బీజేపీ సీనియర్ నేత నిశికాంత్ దూబేకు సమాచార ప్రసార, సాంకేతికత కమిటీ అధిపతిగా మరోసారి అవకాశం దక్కింది. మేధా విశ్రామ్ కులకర్ణిని సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల కమిటీ ఛైర్‌పర్సన్‌గా మరోసారి అవకాశం కల్పించారు. రైల్వే కమిటీ ఛైర్‌పర్సన్‌గా సీఎం రమేశ్ స్థానంలో బీజేపీకి చెందిన సుధీర్ గుప్తా బాధ్యతలు చేపట్టారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ కమిటీ అధిపతిగా కాంగ్రెస్‌కు చెందిన సప్తగిరి శంకర్ ఉలక తిరిగి నియమితులయ్యారు. ఈ ఏడాదికి గానూ పార్లమెంటరీ స్థాయీ కమిటీలను రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పునర్వ్యవస్థీకరించారు. ప్రతి కమిటీలోనూ లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులు ఉంటారు. పలు కమిటీలలో ఇంకా కొన్ని ఖాళీలు ఉన్నాయి. రక్షణ కమిటీలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సభ్యుడిగా ఉన్నారు. హోం వ్యవహారాల కమిటీలో ప్రియాంక గాంధీ వాద్రా సభ్యురాలిగా ఉన్నారు.

**సుప్రీంకోర్టుకెక్కిన టీఎంసీ పేరు, గుర్తు వివాదం**

మరోవైపు, బంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌లోని రెండు వర్గాల మధ్య కొనసాగుతున్న పార్టీ పేరు, గుర్తు వివాదం ఇటీవలే సుప్రీంకోర్టుకు చేరింది. ఈ క్రమంలో దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలను ఇచ్చింది. ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ పేరు, పూలు-గడ్డి గుర్తు ఎవరికి చెందాలన్న విషయాన్ని ఎన్నికల సంఘం నిర్ణయించాల్సి ఉందని తెలిపింది. ఆ ప్రక్రియను ఆలస్యం చేయకుండా పూర్తి చేసేందుకు ఈసీకి సుప్రీంకోర్టు కాలపరిమితిని కూడా విధించింది. టీఎంసీ పేరు, గుర్తుపై ఉన్న వివాదానికి సంబంధించి ఎన్నికల సంఘం ముందు ఇరు వర్గాలు తమ వాదనలు వినిపించాలని, అవసరమైన పత్రాలను అందించాలని సూచించింది. అందుకోసం నాలుగు వారాల గడువునిచ్చింది. టీఎంసీ ఇరు వర్గాలు తమ వాదనలు పూర్తి చేసిన తర్వాత ఎన్నికల సంఘం మూడు నెలల్లోగా తుది నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది.

# హైదరాబాద్‌లో 'విదేశీయుల'పై నజర్

**హైదరాబాద్:** నగరంలో అక్రమంగా ఉంటున్న విదేశీయులపై పోలీసుల నిఘా ముమ్మరమైంది. వీసా గడువు ముగిసినా నగరంలో కొనసాగుతున్న వారిని గుర్తించేందుకు స్పెషల్ బ్రాంచ్, ఎఫ్‌ఆర్‌ఆర్‌ఓ, స్థానిక పోలీసులు, ఐటీ సెల్ సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఇప్పటికే 49 మంది అక్రమంగా ఉంటున్న విదేశీయులను గుర్తించి హోల్డింగ్ సెంటర్లకు తరలించగా.. 12 మందిని స్వదేశాలకు పంపించారు. తనిఖీల్లో నకిలీ కరెన్సీ, డ్రగ్స్, మోసాలు, వ్యభిచారం వంటి పలు అక్రమ కార్యకలాపాలు వెలుగులోకి రావడంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. టౌలిచౌకి పోలీస్ స్టేషన్–30, లంగర్ హౌస్–6, మెహదీపట్నం–6, రాజేంద్రనగర్–3, బంజారాహిల్స్–2, సైఫాబాద్–1, గుడిమల్కాపూర్–1 విదేశీయుల వివరాలు నమోదయ్యాయి. స్టూడెంట్ వీసాపై ఇండియాకు వచ్చి, వీసా గడువు ముగిసిన తర్వాత కొందరు విదేశీయులు ఆసుపత్రులకు వచ్చే విదేశీ రోగులకు అనువాదకులుగా (ట్రాన్స్‌లేటర్లు), మధ్యవర్తులుగా పనిచేస్తున్నట్లు తేలింది. వీరు రోగుల నుండి భారీగా రుసుము వసూలు చేయడమే కాకుండా, ఆసుపత్రి బిల్లులో దాదాపు 15 శాతం వరకు కమిషన్ పొందుతున్నట్లు గుర్తించారు. కొందరు విదేశీ మహిళలు వ్యభిచార కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు వెల్లడైంది. టూరిస్ట్ వీసాపై వచ్చి గడువు ముగిసిన తర్వాత కూడా ఉంటున్న ఒక కెన్యా దేశస్తురాలు వ్యభిచారం చేస్తున్నట్లు గుర్తించారు. ఇళ్లు, ఫ్లాట్లు, హోటళ్లు, గెస్ట్ హౌస్‌లు, సర్వీస్ అపార్ట్‌మెంట్లు.. విదేశీయులకు వసతి కల్పించే



వారందరూ తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని పోలీసులు సూచించారు. వసతి కల్పించే ముందే విదేశీయుల పాస్‌పోర్ట్, వీసా, ఇతర పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని.. విదేశీయుల నివాస సమాచారాన్ని అధికారులకు తప్పనిసరిగా సమర్పించాలన్నారు.

# 10 నుంచి బతుకమ్మ వేడుకలు..

# హైదరాబాద్ మొత్తం ఏం చేస్తున్నారంటే?

**హైదరాబాద్:** బతుకమ్మ పండగను ఈ నెల 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై శనివారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా ఈనెల 18వ తేదీన సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని ట్యాంక్ బండ్ పై వేలాది మంది మహిళలతో ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్టు సంజయ్ జాజు తెలిపారు. 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగా ఉండే అమరవీరుల స్మారక కేంద్రం నుంచి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని పండగ శోభ వచ్చేలా నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విధ్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుంచి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశం ఉండడంతో వారికి ఏ విధమైన ఇబ్బందులూ లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**నెక్లెస్ రోడ్డులో బతుకమ్మల నిమజ్జన ఏర్పాట్లు**

అదే విధంగా, ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్ లో ఉన్న



బతుకమ్మ ఘాట్ తో పాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్‌ఎండీఏ, జీహెచ్ ఎంసీ అధికారులను సీఎస్ ఆదేశించారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల మధ్య ట్యాంకు బండ్ పై బతుకమ్మ ఉత్సవాలు జరుగుతుండడంతో ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. అమరవీరుల స్మారక కేంద్రం నుంచి ట్యాంక్ బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడింగ్, లైటింగ్ సౌకర్యాలను కల్పించాలని సూచించారు. బతుకమ్మ జరిగే పది రోజుల పాటు రవీంద్ర భారతిలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తుండడంతో అక్కడ కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని టూరిజం కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లోనూ బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలని అన్నారు. బతుకమ్మ ఉత్సవాలను ప్రతిబింబించేలా ఈ సారి ప్రత్యేక లోగోను రూపొందిస్తున్నామని వెల్లడించారు. డిసెంబర్‌లో జరుగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను కూడా ఈ లోగోలో తెలియచేసే విధంగా రూపొందించనున్నట్టు తెలిపారు.

# కుల, మత రహితులనూ గణించాలి

**హైదరాబాద్:** కులం, మతం పట్టింపులేని వారి వివరాలు కూడా జనగణనలో పరిగణనలోకి తీసుకోవాలని హైదరాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టులు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2027 జనగణనలో కుల, మత రహితుల వివరాలు సేకరించాలని కోరారు. ఈ మేరకు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ అస్తిత్వ ప్రకటన ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని దీన్ని గుర్తించి, గౌరవించాలని హైకోర్టు ద్వారా కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

మనదేశంలో వివిధ మత విశ్వాసాలు కలిగిన ప్రజలు మాత్రమే కాకుండా ఎటువంటి మతవిశ్వాసాలు లేని హేతువాదులు, నాస్తికులు, భౌతిక వాదులు, మానవతావాదులతో సహా కమ్యూనిస్టులూ ఉన్నారనీ.. వ్యక్తులుగా, సమూహాలుగా అనేక మంది వారి నిత్య జీవిత ఆచరణలో కుల రహిత, మత రహిత అస్తిత్వంతో ఉన్నారని పిటిషనర్లు సి. వనజ, డీవీ రామకృష్ణా రావు పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక సర్వేలో భాగంగా బీసీ కులగణన చేసిన నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు కుల రహితులను, మత రహితులను కూడా గణించింది. రాష్ట్రంలో 11.96 లక్షల మంది తమని తాము కుల రహితులుగా, మత రహితులుగా ప్రకటించుకున్నారు. రాష్ట్రంలో స్కూలు, కాలేజీ విద్యా స్థాయిలో డీవీ రామకృష్ణారావు, ఎస్ క్లారెన్స్ కృపాళిని దంపతులు 2010, 2017 లలో కోర్టు మెట్లు ఎక్కారు. తమ పిల్లవాడి బర్త్ సర్టిఫికెట్ కోసం డేవిడ్, రూపా దంపతులు కూడా కోర్టులో పోరాటం చేశారు. తెలంగాణలో కుల గణన సందర్భంలో కుల నిర్మూలన సంఘం వేసిన పిటిషన్‌పై



వెలువడిన తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కుల రహితులను, మత రహితులను గణించింది. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కల్లోనూ కుల రహితులను, మత రహితులను గణించమని కోరుతూ 12 మంది వేసిన రిట్ పిటిషన్ 1420/2026, కుల నిర్మూలన సంఘం వేసిన పిటిషన్ 40062/2025 లు హైకోర్టు బెంచ్ ముందుకు రానున్నాయి. ఈ నేపథ్యంలో జనాభా లెక్కల్లో కుల, మత రహితులను గణించమని హైకోర్టు ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని పిటిషనర్లు కోరారు.

## ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నీటి కొరత

-మొదటిపేజీ తరువాయి

ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం, ఎన్‌ఎంఈఓ పథకాల కింద విత్తనాలను పంపిణీ చేస్తునట్లు వెల్లడించారు. ఆయా ప్రాజెక్టుల్లో నీటి నిల్వల ఆధారంగా సాగునీటి ప్రణాళిక రచిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో నీటి పారుదల ప్రణాళిక అమలు చేయాలని సూచించారు.

**పంటలకు స్ప్రింక్లర్లను సబ్సిడీపై అందించేందుకు చర్యలు...**

మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను రైతన్నలు ఎంచుకోవాలని మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు. వేరుశనగలో నూతన విత్తన రకాలను అభివృద్ధి చేయాలని చెప్పుకొచ్చారు. ఇతర పంటలకు స్ప్రింక్లర్లను సబ్సిడీపై అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఆయిల్‌పామ్ గెలలను వేగంగా ఫ్యాక్టరీలకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అన్నదాతలకు చెల్లింపులను త్వరితగతిన జరిగేలా చూస్తామని మాటిచ్చారు. నూనెగింజల విత్తనాల కోసం రూ.49.35 కోట్లను కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రానికి ఇప్పటికే రూ.34.55 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. 52,425 ఎకరాలకు 29,375 క్వింటాళ్ల విత్తనాలను ధ్రువీకరించినట్లు తెలిపారు.

**కొన్ని రకాల విత్తనాలకు వందశాతం సబ్సిడీ..**

రూ.36.76 కోట్ల సబ్సిడీతో నూనెగింజల విత్తనాలను పంపిణీ చేస్తామని మంత్రి తుమ్మల అన్నారు. వేరుశనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, నువ్వుల విత్తనాలను పంపిణీ చేస్తామని వివరించారు. పప్పుధాన్యాల కోసం రూ.34.60 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. 21 జిల్లాల్లో 29,008 క్వింటాళ్ల పప్పుధాన్యాల విత్తనాలను పంపిణీ చేస్తామని అన్నారు. శనగ, మినుము, పెసర విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేస్తామని చెప్పారు. విత్తనాలకు 50 నుంచి 75 శాతం వరకు సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. కొన్ని రకాల విత్తనాలకు వందశాతం సబ్సిడీ ఇస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## ప్రయాణికులకు ఎంతో సౌకర్యం

-మొదటిపేజీ తరువాయి

విధానమని ప్రయాణికులు అంటున్నట్లు చెప్పారు. మెట్రో ప్రయాణికులకు గమ్యస్థానానికి చేరుకునేలా తొలి కనెక్టివిటీగా ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవచ్చని మంత్రి స్పష్టం చేశారు.

**సులభమైన ప్రయాణమే ప్రభుత్వ లక్ష్యం**

మెట్రో––ఆర్టీసీ అనుసంధానాన్ని మరింత విస్తరిస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇంటి నుంచి గమ్యస్థానం వరకు సులభమైన ప్రయాణమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మెట్రో––ఆర్టీసీతో పాటు ఆటోలు, ఊబర్ సేవలను అనుసంధానించే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. చివరి గమ్యస్థానానికి చేరుకునేలా 'లాస్ట్ మైల్ కనెక్టివిటీ'పై దృష్టి పెట్టామని స్పష్టం చేశారు. ప్రజా రవాణా వ్యవస్థను సమగ్రంగా అనుసంధానం చేస్తామన్న ఆయన, ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యంగా ఆర్టీసీ––మెట్రో కామన్ పాస్ సేవలను తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా కామన్ పాస్‌ను అందుబాటులోకి తెచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు భట్టి కృతజ్ఞతలు తెలిపారు.

మెట్రోతో పాటు ఆర్టీసీని కలిపి పాస్ ఇవ్వడం వల్ల ప్రయాణికులకు చాలా ఉపయోగకరం. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ వైపు ప్రజలను ఆకర్షించేందుకు, ట్రాఫిక్ సమస్య నివారణ, హైదరాబాద్ అభివృద్ధిలో అందరిని భాగం చేసేందుకు ప్రభుత్వం మెట్రో, ఆర్టీసీ కామన్ పాస్ తీసుకొచ్చింది – పొన్నం ప్రభాకర్, రవాణాశాఖ మంత్రి రోజుకు రూ.400 ధర నిర్ణయించిన ఈ పాస్? రెగ్యులర్?గా నగరంలో తిరిగేవారికి మరింత ఉపయోగిపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

## ఆస్పత్రుల నిర్మాణాల్లో వేగం పెంచండి

-మొదటిపేజీ తరువాయి

తప్పనిసరిగా సందర్శించాలని ఆదేశించారు. జిల్లాల్లోని ఆస్పత్రులనూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.

**అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండాలి**

విద్య, వైద్య శాఖలపై సీఎంవో అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి, అధికారులకు కీలక ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఆస్పత్రుల నిర్మాణం పూర్తయ్యేనాటికి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**ప్రతివారం సమీక్ష నిర్వహించాలి**

కలెక్టర్లతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, ఆస్పత్రులను సందర్శించాల్సిందేనని స్పష్టం చేశారు. జిల్లాస్థాయిలో ప్రతీ వారం సమీక్ష నిర్వహించాలని నిర్దేశించారు. సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. పాఠశాలల్లో అవసరమైన చోట మరమ్మతు పనులను చేయాలన్నారు.

**లి**సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. అవసరమైన చోట ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టాలని సూచించారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 ఏర్పాట్లపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడులపై పకడ్బందీ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలిస్తానని గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పెట్టుబడుల విషయంలో పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. త్వరలోనే ఏర్పాట్లను పరిశీలిస్తానని చెప్పారు. ఈ సమీక్షలో ఎంపీ వేంనరేందర్‌రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి పథకం స్థానంలో.. బంగారం




పేదింటి ఆడబిడ్డలకు తులం బంగారం అందించే పథకం అమలు చేయడానికి తెలంగాణ సర్కార్ సిద్దమవుతోంది. తాము అధికారంలోకి వస్తే పెళ్లి చేసుకునే పేద కుటుంబాల్లోకి ఆడబిడ్డలకు తులం బంగారం అందిస్తామంటూ కాంగ్రెస్ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చింది. ఈ హామీని ఇప్పటివరకు నెరవేర్చకపోవడంతో ప్రతిపక్షాల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో తులం గోల్డ్ స్కీమ్ అమలకు రేవంత్ సర్కార్ సన్నద్ధమవుతోంది. దసరా నుంచి ఈ స్కీమ్ అమల్లోకి తీసురావాలని భావిస్తోంది. దసరా నుంచి ఈ పథకాన్ని అమలు చేయాలని సమాలోచనలు చేస్తోంది. కళ్యాణలక్ష్మి పథకం స్థానంలో దీనిని అమలు చేయనున్నారని చెబుతున్నారు.

**కళ్యాణ లక్ష్మి పథకం స్థానంలో..**

ప్రస్తుతం కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా పెళ్లి చేసుకునే ఆడబిడ్డలకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇక నుంచి ఆర్థిక సాయం కాకుండా తులం గోల్డ్ అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. పుస్తెలు, మట్టెల రూపంలో తులం బంగారం అందించాలని భావిస్తోంది. దసరా నుంచి ఈ కొత్త పథకాన్ని ప్రారంభించే యోచనలో ఉన్నట్లు ప్రభుత్వం అధికార వర్గాలు చెబుతున్నాయి. దసరా పెద్ద పండుగ కావడంతో ఆ రోజున ఈ స్కీమ్ లాంచ్ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే దసరా కానుకగా మరికొన్ని కార్యక్రమలను ప్రభుత్వం ప్రారంభించనుందని సమాచారం. కొత్త ఆసరా పింఛన్లను కూడా దసరా నుంచి అందించనుందని తెలుస్తోంది. ఇటీవల అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా.. లక్షలాది మంది అప్లై చేసుకున్నారు. దీంతో వారి దరఖాస్తులను పరిశీలిస్తోంది.

**దసరా సందర్భంగా కొత్త పింఛన్లు**

త్వరలో సామాజిక పించన్లకు సంబంధించి అర్హుల జాబితా సిద్దం చేయనుండగా.. దసరా నుంచి కొత్త పింఛన్లను అందించనుందని తెలుస్తోంది. అలాగే బతుకమ్మ చీరల పంపిణీ కూడా త్వరలో ప్రారంభం కానుంది. ఈ సారి చీరల డిజైన్ కూడా మార్చారు. త్వరలో బతుకమ్మ వస్తుండటంతో వీటిని పంపిణీకి సిద్దం చేయనున్నారు. అలాగే ఉద్యోగులకు రెండు డీఏలను విడుదల చేసేందుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దసరా సందర్భంగా వీటిని విడుదల చేయనున్నారు. అలాగే కేసీఆర్ కిట్ తరహాలోనే మరో పథకం కూడా దసరా సందర్భంగా ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీని వల్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు. ఇలా దసరాకు అనేక పథకాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్దమవుతోంది.

# సంపాదకీయం

## మిడ్-ఎయిర్ డ్రామా

దుబాయ్ నుండి టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానంలో ఆకాశంలోనే ఊహించని విధంగా అత్యంత నాటకీయమైన, తీవ్ర భయాందోళనకరమైన సన్నివేశం చోటుచేసుకుంది. ఇస్రాయెల్ ప్రయాణికులతో నిండిన ఈ విమానాన్ని కూల్చివేసేందుకు ఓమన్ దేశానికి చెందిన కో-పైలట్ యత్నించడం సంచలనం సృష్టించింది. తీవ్ర మత తీవ్రవాద భావజాలం కలిగిన ఈ ఓమన్ పైలట్, తన తోటి పైలట్‌పై ఒక్కసారిగా దాడికి తెగబడి విమానాన్ని కిందకు దించేందుకు ప్రయత్నించాడు. అతని ఉన్మాద చర్యల కారణంగా విమానం కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే ఏకంగా 14,000 అడుగుల కిందకు పడిపోయింది. అలాగే కేవలం రెండు నిమిషాల కంటే తక్కువ సమయంలో మొత్తం 17,000 అడుగుల ఎత్తు నుండి విమానం వేగంగా కిందకు దూసుకుపోవడంతో విమానంలోని ప్రయాణికులు మరణభయంతో అల్లల్లాడిపోయారుఈ భయంకరమైన సన్నివేశంలో విమాన పైలట్-ఇన్-కమాండ్, భారతీయ మూలాలున్న కెప్టెన్ స్మిత్ మచ్చుర్ అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించారు. సుమారు 13 సంవత్సరాలకు పైగా కమర్షియల్ విమానయాన అనుభవం, దాదాపు 9,750 గంటల ఫ్లయింగ్ రికార్డ్ ఉన్న స్మిత్ మచ్చుర్, గతంలో స్పైస్‌జెట్‌లో 11 ఏళ్ల పాటు లైన్ ట్రైనింగ్ కెప్టెన్‌గా సేవలు అందించారు. కో-పైలట్ జరిపిన రక్తసిక్తమైన దాడిలో కెప్టెన్ స్మిత్ తీవ్రంగా గాయపడి, రక్తం ఓడుతున్నప్పటికీ, ఏమాత్రం ఉపేక్షించకుండా కాక్‌పిట్ తలుపులను అన్‌లాక్ చేయడంలో విజయం సాధించారు. విమానం నిటారుగా కిందకు పడిపోతున్న క్లిష్ట సమయంలో ఆయన కాక్‌పిట్ డోర్ తెరవడమే ప్రయాణికుల ప్రాణాలను కాపాడటంలో అతిపెద్ద మలుపుగా మారింది.కాక్‌పిట్ డోర్ తెరచుకోగానే యామివ్ హయూన్ అనే ఇస్రాయెలీ ప్రయాణికుడు తక్షణమే స్పందించి కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లాడు. దాడికి తెగబడిన ఓమన్ పైలట్‌ను విమాన నియంత్రణ ప్యానెల్ నుండి వెనక్కి లాగి, ఇతర ప్రయాణికులు మరియు సిబ్బంది సాయంతో అతనిని పూర్తిగా లొంగదీసుకున్నాడు. అనంతరం విమానాన్ని సురక్షితంగా రక్షించి, సౌదీ అరేబియాలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ భయంకర సంఘటనలో కాక్‌పిట్ మొత్తం రక్తసిక్తమైనట్లు ప్రయాణికులు తెలిపారు. ఈ విపత్తు సమయంలో భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చుర్ ప్రదర్శించిన అద్భుతమైన సమయస్ఫూర్తి, సాహసాన్ని ఇస్రాయెల్ ప్రధాని బె?ంజమిన్ నెతన్యాహు స్వయంగా కొనియాడారు.సహచర పైలట్ల కథనం ప్రకారం, దాడికి పాల్పడిన ఓమన్ పైలట్ ఎనిమిది నెలల క్రితమే ఫ్లైదుబాయ్‌లో చేరాడని, ఆయన తీవ్ర మత తీవ్రవాద భావాలు కలిగిన వ్యక్తి అని వెల్లడైంది. రోజులో విపరీతంగా ప్రార్థనలు చేయడం, మహిళలకు కనీసం షేక్ హ్యాండ్ ఇవ్వడానికి కూడా నిరాకరించడం వంటి ప్రవర్తన అతనిలో కనిపించేదని తెలిసింది. ఈ ఊహించని విమాన ప్రమాద ముప్పుపై ప్రస్తుతం సమగ్ర దర్యాప్తు జరుగుతుండగా, ఫ్లైదుబాయ్ సంస్థ ఇస్రాయెల్‌కు రాకపోకలు సాగించే తన విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేసింది.ఫ్లై దుబాయ్ కంపెనీలో విమానాన్ని నడుపుతున్న భారతీయ పైలట్ స్మిత్ మచ్చార్ మీద ఒమన్ దేశానికి చెందిన కో పైలట్ దాడి చేసి కత్తితో అతడిని పొడిచాడు. అతడు తీవ్రంగా గాయపరుస్తున్నప్పటికీ పైలట్ ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. పైగా విమానాన్ని ముందుకు పోనిచ్చాడు. విమానం తలకిందులు అవుతున్నప్పటికీ అతడు ఏమాత్రం వెనకడుగు వేయలేదు. తన ప్రాణాలు పోతాయని తెలిసినప్పటికీ కూడా తోటి ప్రయాణికుల ప్రాణాలను అతని కాపాడాడు.విమానం తలకిందులు కావడం.. అప్పటికే అది సౌదీ అరేబియా గగన తలం మీద ఉంది. అప్పటికే దాని నుంచి అత్యవసర పరిస్థితి అంటూ తబుక్ విమానాశ్రయానికి సంకేతం వచ్చింది. మరికొద్ది నిమిషాల్లోనే కోడ్ 7500 (హైజాక్) అంటూ సందేశం అందింది. ఈ సందేశంతో తీవ్ర కలకలం నెలకొంది. ఇజ్రాయిల్ దేశం మీద ఉగ్రదాడి జరుగుతుందని ప్రచారం మొదలైంది. పైగా విమానంలో ప్రయాణిస్తున్న మెజారిటీ ప్రయాణికులు ఇజ్రాయిల్ దేశానికి చెందినవారు. దీంతో ఇజ్రాయిల్ ప్రధానమంత్రి.. రక్షణ మంత్రి వెంటనే సమావేశం ఏర్పాటు చేశారు. ఇజ్రాయిల్ యుద్ధ విమానాలను రంగంలోకి దింపారు.అప్పటికే కత్తితో దాడి చేసిన కో పైలట్ ను పైలట్.. ప్రయాణికులు పట్టుకున్నారు. తీవ్ర గాయాలైన పైలెట్ కు విమానంలో ఉన్న ఒక వైద్యుడు ప్రాథమికంగా చికిత్స అందించారు. ఆ తర్వాత ప్రయాణికులలో ఇద్దరు ఇతర విమాన పైలట్ల సహాయంతో అభిమానాన్ని కిందికి మళ్లించారు. ఆ తర్వాత కోడ్ ను హైజాక్ నుంచి సాధారణ అత్యవసర పరిస్థితి కి మార్చారు.పైలట్ పై దాడికి పాల్పడి.. విమానాన్ని కూల్చాలి అనుకున్న ఒమన్ కో పైలెట్ విషయంలో అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా ఇజ్రాయిల్, ఒమన్ దేశాల మధ్య అంతగా సంబంధాలు లేవు. దీనికి తోడు అరబ్, గల్ఫ్ దేశాల నుంచి ఇజ్రాయిల్ వచ్చే విమానాల మీద తీవ్రస్థాయిలో పరిశీలన ఉంటుంది. అలాంటిది ఇజ్రాయిల్ దేశానికి వెళ్లే విమానంలో పైలట్ గా ఒమన్ జాతీయుడిని ఎలా అనుమతించారు అనే విషయం మీద అనేక రకాల సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇజ్రాయిల్ రవాణా శాఖ మంత్రి కూడా ఈ వే సందేహాలను వ్యక్తం చేశారు. విమానం కూల్చడానికి ముందుగానే ప్రణాళిక రూపొందించారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అయితే ఒమన్ కో పైలట్ అసలు ఉద్దేశం ఏంటి.. అతని ప్రణాళిక ఏంటి.. దాడికి ఎందుకు ప్రయత్నించాడు అనే అంశాల మీద ఇంతవరకు క్లారిటీ లేదు. ఇతర వెనుక ఎవరైనా ఉన్నారా.. అందుకోసమే ఇదంతా చేశాడా అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది.పైలట్ మీద కత్తి దాడి జరిగిన తర్వాత విమానం తలకిందులుగా ప్రయాణించడం మొదలుపెట్టింది. కేవలం 29 సెకండ్ల కాలంలో 31 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న విమానం ఏకంగా 17 అడుగులకు దిగింది. దాదాపు 14 అడుగుల మేర నిలువుగా కిందికి దిగింది. ఆ తర్వాత 19 వేల అడుగులకు చేరుకుంది. ప్రయాణ మార్గాన్ని పూర్తిగా మార్చుకుంది. జోర్డాన్ సరిహద్దుల సమీపంలో అసాధారణమైన రీతిలో తిరిగింది. మళ్లీ వెనక్కి వెళ్ళింది. గంట తర్వాత సౌదీ అరేబియాలోని తబూకు విమానాశ్రయంలో ల్యాండ్ అయింది.

# ఆహార సంక్షోభం ముప్పు

న్యూయార్క్ ఏషియా సొసైటీ వేదిక మీద భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ రానున్న ఆహార సంక్షోభం గురించి చేసిన హెచ్చరికను ఏదో సాధారణ వ్యాఖ్యగా తీసుకోలేం. ఆయన చేసిన హెచ్చరిక కొత్తగా పుట్టుకు వచ్చింది కాదు. కొన్నాళ్లుగా దానిపై దేశంలో చర్చ నలుగుతూనే ఉన్నది. గోడదెబ్బ, చెంపదెబ్బ అన్నట్టుగా అంతర్జాతీయ సమస్యలు ఓ వైపు, పర్యావరణ క్షీణత మరోవైపు నుంచి తరుముతున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, ఇరాన్‌పై అమెరికా యుద్ధం, అంతర్జాతీయంగా చమురు, ఎరువుల సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. అమెరికా విధిస్తున్న పరిహార ఆంక్షలు దీనికి ఆజ్యం పోస్తున్నాయి. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు, ఇంధన ధరల అస్థిరత ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. ఈ సంక్షోభం భారత్ మీద ఎంత ప్రభావం చూపుతున్నదో నిర్ణయించేది మన దేశీయ సంసిద్ధత, విధానాల పటిష్టత, రాజకీయ విజ్ఞత మాత్రమే. దిగుమతులపై అధికంగా ఆధారపడటం భారత ఆర్థిక వ్యవస్థ ప్రధాన బలహీనత. ఇంధనం, ఎరువులు, ముడిసరుకుల విషయంలో విదేశీ మార్కెట్లపై ఆధారపడటం వల్ల అంతర్జాతీయ ధరలు పెరిగితే దేశీయంగా ఆ భారం మోయక తప్పదు. మరోవైపు సబ్సిడీలు పెంచాల్సి రావడం సహజం, ఆర్థిక లోటు పెరుగుదల, పరిమిత ఆదాయ వనరులు ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ సామర్థ్యానికి పరీక్షలుగా మారాయి.



ఇక ఎల్ నినో ప్రభావం ఈ సవాళ్లకు మరొక అదనపు ముప్పును జోడిస్తున్నది. సాధారణంగా ఎల్ నినో వల్ల వర్షపాతం తగ్గిపోయి, ఉష్ణోగ్రతలు పెరిగిపోతాయి. దీనివల్ల పంటలు దెబ్బతిని ఆహార కొరత ఏర్పడుతుంది. మహారాష్ట్రలో ఇప్పటికే కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. మన రాష్ట్రంలో ఈ ఏడాది మొత్తంగా చూస్తే వర్షపాతం సాధారణ స్థాయిలో ఉన్నట్టు చెప్తున్నప్పటికీ, 18 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఇటీవలి వర్షపాతం గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆగస్టులోనే సుమారు 38 శాతం వరకు వర్షాభావం నమోదవడం, మొత్తం మాన్సూన్ కూడా సాధారణ స్థాయికి తగ్గిపోవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

ఎల్ నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఏర్పడిన వర్షాభావంలో భాగమే ఇది. దేశం మొత్తం గత దశాబ్దంలోనే కనిష్ఠ వర్షపాతం నమోదవడం ఈ సమస్యకు స్పష్టమైన సూచన. నాగార్జునసాగర్ వంటి కీలక జలాశయాలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో నిండలేదు. ప్రవాహాలు అస్థిరంగా ఉండటం వల్ల భవిష్యత్ నీటి లభ్యతపై స్పష్టత లేదు. ముఖ్యంగా సెప్టెంబర్అక్టోబర్‌లో వచ్చే ప్రవాహాలపై ఆధారపడే పరిస్థితి గతంలో ఉన్నా, ఇప్పుడు వర్షాల అస్థిరత కారణంగా ఆ నమ్మకం తగ్గిపోయింది. దేశవ్యాప్తంగా పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉన్నది. దక్షిణ భారత రాష్ట్రాల రిజర్వాయర్లు కేవలం సుమారు 50 శాతం సామర్థ్యంతోనే ఉండటం సమస్య తీవ్రతను తెలియజేస్తున్నది.

రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ అందుబాటులో ఉన్న ప్రాజెక్టులను పడావుపెట్టి, పెండింగ్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం వల్ల సాగునీరు తగిన స్థాయిలో అందుబాటులోకి రావడం లేదు. భూగర్భ నీటిమట్టాలు భారీగా పడిపోతున్నాయి. మరోవైపు పంట పెట్టుబడుల సమస్య వేధిస్తున్నది. ఇవన్నీ వెరసి సాగును సంకటంలో పడేస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో ఆహార కొరత లేకపోయినప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తుల ధరల పెరుగుదల సమస్య మాత్రం తీవ్రంగానే ఉంటుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

బహిరంగ మార్కెట్లో ఈసరికే రూ.70 దాటిన బియ్యం ధరలు సెంచరీ కొడతాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఉల్లిగడ్డల ధరలు కూడా కిలో రూ.60 దాటిపోయాయి. ఇక కూరగాయలు, ఇతర సరుకుల ధరలు సామాన్యులకు మోయరాని భారంగా పరిణమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఆహార సమస్య తీవ్రరూపం దాల్చవచ్చని విదేశాంగమంత్రి చేసిన హెచ్చరిక ప్రాముఖ్యం సంతరించుకున్నది. ధరల సమస్య స్థానంలో తీవ్రమైన ఆహార కొరత ఎదురుకాకుండా చూడటం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పెనుసవాల్‌గా ఉంటుంది. తక్షణం వ్యవసాయరంగ సమస్యలపై అవి సమన్వయంతో దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. అంతకన్నా ముందు ధరల తగ్గుదలకు చొరవ తీసుకోవాల్సి ఉన్నదని చెప్పక తప్పదు.

# నాలుగు స్తంభాలూ కూలుతున్నాయి!

మహాత్మాగాంధీ తన జీవితంలో చివరి మూడు దశాబ్దాలు బ్రిటిష్ వలసపాలన నుంచి భారత్‌కు స్వాతంత్ర్యం సాధించడంలో గడిపారు. 'స్వతంత్ర భారతదేశం ఎలా ఉండాలి?' అన్నదానిపై ఆయన తన భావనలను ఆ కాలంలో అరుదుగా రాశారు, మాట్లాడారు. అయితే 1922 మార్చిలో స్వరాజ్‌కు ఆయన ఒక చిన్న, సంక్షిప్త నిర్వచనాన్ని ప్రతిపాదించారు. నేడు మనం మళ్లీ దానిని గుర్తు చేసుకుని, స్ఫూర్తి పొందవలసిన అవసరమున్నది. అస్పృశ్యత నిర్మూలన, ఖద్దర్ ఉత్పత్తి, హిందూ--ముస్లిం సమైక్యత, అహింసా సాధన అనేవి ఆయన ఆశించిన స్వరాజ్‌కు పునాదులుగా ఉన్నాయి. స్వరాజ్ సౌధం ఎల్లప్పుడూ ఆధారపడి ఉండే నాలుగు మూల స్తంభాల్లో ఒక్కదాన్ని తొలగించినా మొత్తం సౌధమంతా కూలిపోతుంది.



స్వరాజ్ స్వరూప స్వభావాలకు ప్రాతిపదికలు అయిన ఆ నాలుగు ముఖ్య అంశాలను మరింతగా వివరంగా చూద్దాం. 'అస్పృశ్యత నిర్మూలన'ను విశాలార్థంలో సామాజిక న్యాయంగా నేడు మనం భావించవచ్చు. కులపరమైన అసమానతలే కాకుండా జెండర్ అసమానతలను సమూలంగా తొలగించడమే సామాజిక న్యాయం. కాంగ్రెస్‌లోని ఇతర సవర్ణ నాయకులు నెహ్రూ, పటేల్, బోస్ వలే కాకుండా భారత స్వాతంత్ర్య సాధనకు అస్పృశ్యతా దురాచారం ఎలా అవరోధమవుతుందో గాంధీకి నిశిత, సమగ్ర అవగాహన ఉంది. అస్పృశ్యత ఒక 'పాపం' అని, దానిని పాటిస్తున్నవారు 'హిందూ ధర్మ వినాశకులు' అని ఆయన నిరసించారు. మహిళా విముక్తి విషయమై కూడా గాంధీ పరిపూర్ణ శ్రద్ధ వహించారు. 1917లో వెలువరించిన ఒక ప్రసంగంలో గాంధీ ఇలా అన్నారు: 'మహిళలు పురుషుల సహవాసులు, మానసిక సామర్థ్యాలలో సమానులు. పురుషుని సమస్త కార్యకలాపాలలో పాల్గొనే హక్కు ఆమెకు ఉన్నది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల విషయంలో పురుషునికి ఎంత హక్కు ఉన్నదో మహిళకూ అంతే సమాన హక్కు ఉన్నది'. వలస పాలకులకు వ్యతిరేకంగా గాంధీ నిర్వహించిన సత్యాగ్రహాలు అన్నిటిలోనూ మహిళలు కీలకపాత్ర వహించారు. గాంధీ మహాత్ముని సాంఘిక సంస్కరణల అజెండాకు పరిమితులు ఉన్నాయి. అస్పృశ్యులను గౌరవప్రదంగా పిలిచేందుకై 'హరిజన్' అనే పదాన్ని ఆయన సృష్టించారు. ఇప్పుడు దాని స్థానంలో 'దళిత్' అనే పదం వాడుకలోకి రావడం ఒక వివేకవంతమైన కాలానుగుణ్య మార్పు. సంప్రదాయ ఆర్థిక వ్యవస్థలో మహిళలు పాల్గొనడంపై గాంధీ అభిప్రాయాలు సందిగ్ధ స్వభావంతో ఉండేవి. అయినప్పటికీ కుల దౌష్ట్యాలను, జెండర్ వివక్షను వ్యతిరేకించడంలో, వాటిని రూపుమాపే కృషిలో తన సమకాలీన జాతీయవాదులు అందరికంటే ఆయన చాలా అభ్యుదయాత్మకంగా ముందుండేవారు. ఖద్దర్ తయారీకి మహాత్ముడు ఇచ్చిన విశేష ప్రాధాన్యం గురించి చూద్దాం. గాంధీ కాలంలోనూ, ఆనాటి నుంచి ఈనాటి దాకా ఖద్దర్ తయారీ అంటే చులకనభావం వ్యక్తమవుతోంది. ఖద్దర్‌ను అంగీకరించడం అంటే ఆర్థికాభివృద్ధిని పెంపొందించే పారిశ్రామిక ఆర్థిక కార్యకలాపాలను తిరస్కరించడంగా పరిగణన అవుతుంది. అయితే స్వతంత్ర భారతదేశం ప్రస్తుతం అనుసరిస్తున్న ఆర్థికాభివృద్ధి బాట అనేక సమస్యల (సంపద కేంద్రీకరణ, గౌరవప్రద, అర్థవంతమైన ఉపాధి అవకాశాల కొరత, పర్యావరణ విధ్వంసం)కు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో గాంధీ ఆర్థిక భావాలకు ఇప్పటికీ కొంత ప్రాధాన్యత ఉంది. ఆయన నిర్వహించిన ఖద్దర్ ఉద్యమం శ్రమ గౌరవానికి, స్థానిక స్వావలంబనకు ప్రాధాన్యమిచ్చింది. ప్రకృతిని, సహజ వనరులను విచక్షణాయుతంగా ఉపయోగించుకోవడం ఎంత ముఖ్యమో ఆయన తరచూ రాస్తుండేవారు. అనేక విధాలుగా గాంధీ ముందస్తు పర్యావరణవాది. వాయు, జల కాలుష్యాన్ని, భూసార క్షీణతను అరికట్టేందుకు, వాతావరణ మార్పును సమర్థంగా ఎదుర్కొనేందుకు గాంధీ భావాలు, ఆచరణలు మనకు ఎంతైనా తోడ్పడగలవు.

గాంధీ స్వరాజ్‌కు మూడో మూల స్తంభం 'హిందూ--ముస్లిం ఐక్యత'. జాతి నిర్మాణంలో మత సామరస్యం ప్రాధాన్యాన్ని ఆయన దక్షిణాఫ్రికాలో తన జీవితానుభవాల నుంచి గ్రహించారు. బొంబాయిలోనే న్యాయవాదిగా గాంధీ రాణించి ఉంటే ఆయన క్లయింట్‌లు, స్నేహితులు దాదాపుగా అందరూ హిందువులు అయివుండేవారు. అయితే బొంబాయిలోను, రాజ్‌కోట్‌లోను న్యాయవాదిగా ఆయన విఫలమయ్యారు. గుజరాతీ ముస్లిం వ్యాపారస్థుల మధ్య వివాదాన్ని పరిష్కరించేందుకు ఆయన దక్షిణాఫ్రికాలోని డర్బన్ నగరానికి వెళ్లారు. అక్కడ ఆయన ఒక సాంఘిక సేవాకర్తగా పరిణమించారు. ప్రవాస భారతీయుల సమస్యల పరిష్కారానికి ఆయన విశేష కృషి చేశారు. ఈ కృషిలో పార్సీలు, ముస్లింలు, తమిళులు ఆయనకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించారు. దృఢమైన జాతీయవాదాన్ని అభివృద్ధిపరచడంలో మతపరమైన, భాషాపరమైన బహుళత్వాన్ని గౌరవించడం ఎంత ముఖ్యమో గాంధీ తెలుసుకున్నారు. 1908లో జోహాన్స్‌బర్గ్ జైలులో ఉన్న సమయంలో ఆయన ఇలా రాశారు: 'దక్షిణాఫ్రికాలో శ్వేతజాతి పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న భారతీయులలో హిందువులు, ముస్లింలు, పార్సీలు, క్రైస్తవులు, బెంగాలీలు, గుజరాతీలు, పంజాబీలు అనే తరతమ తేడాలు లేవు. మేమందరమూ భారతీయులమే. భారతదేశం కోసం పోరాడుతున్నాం'. జైలు నుంచి విడుదలైన తరువాత జోహాన్స్‌బర్గ్‌లోని భారతీయుల నుద్దేశించి గాంధీ మాట్లాడుతూ, 'రెండు కళ్లు (హిందువులు, ముస్లింలు) నిరపాయంగా ఉంటే మీరు వర్ధిల్లుతారు... ఉభయ మతాలవారు సమైక్యంగా ఉంటే భారత్‌కు మీరే పాలకులు అవుతారు' అని ఉద్ఘాటించారు. భారత్‌కు తిరిగివచ్చిన తరువాత ఆయన అవే సునిశ్చిత విశ్వాసాలతో పనిచేశారు. మత సామరస్యానికి ఎంతగానో కృషి చేసినా దేశ విభజనను నివారించడంలో గాంధీ విఫలమయ్యారు. 1947 ఆగస్టు తరువాత భారతదేశంలో ఉండిపోయిన ముస్లింలకు హిందువులతో పాటు సమాన హక్కులు లభించేందుకు ఆయన కృతనిశ్చయంతో పనిచేశారు. మైనారిటీల హక్కులను సంరక్షించేందుకై 1947 సెప్టెంబర్‌లో కలకత్తాలోను, 1948 జనవరిలో న్యూఢిల్లీలోను ఆయన నిరాహారదీక్షలు నిర్వహించారు. ఈ రెండు దీక్షల మధ్య కాలంలో 1947 నవంబర్ 15న న్యూఢిల్లీలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ మౌలిక లక్ష్యాలకు పార్టీ సభ్యులందరూ కట్టుబడి ఉండాలని విజ్ఞప్తి చేశారు. హిందూ--ముస్లిం ఐక్యతకు కృషి చేయడం కాంగ్రెస్ స్వతస్సిద్ధ స్వభావమని, గత ఆరు దశాబ్దాలుగా అందుకు కాంగ్రెస్ చేస్తున్న కృషిని మరింత సమగ్రంగా కొనసాగించాలని ఆయన కోరారు. గాంధీ స్వరాజ్ నాలుగో మూల స్తంభమైన అహింసా సాధన గురించి చూద్దాం. గాంధీ అహింసా ప్రవక్త. ప్రజా జీవితంలో అహింసా పద్ధతులకు ఆయన ప్రాధాన్యమిచ్చారు. తన తుది శ్వాస వరకు అహింసను మనసా వాచా కర్మణా ఆచరించారు. దక్షిణాఫ్రికాలోని భారతీయుల హక్కుల కోసం చేస్తున్న కృషిలో భాగంగా గాంధీ 1909 వేసవికాలంలో లండన్ నగరానికి వెళ్లారు. ఆ రోజుల్లోనే భారతీయ యువకుడు ఒకరు ఒక బ్రిటిష్ ఉన్నతాధికారిని తుపాకీ కాల్పులతో హతమార్చాడు. ఈ ఘటన గాంధీని భీతావహుడిని చేసింది. ఆయన ఇలా రాశారు: ఇటువంటి హింసాత్మక చర్యలతో బ్రిటిష్ వారు భారత్ నుంచి నిష్క్రమించినా వారి స్థానంలో దేశ పాలకులు అయ్యేది ఎవరు? ఈ ప్రశ్నకు ఏకైక సమాధానం: హంతకులు. ఆ హంతకులు శ్వేత జాతీయులైనా లేక నల్ల జాతీయులైనా వారి పాలన నుంచి భారత్ ప్రయోజనం పొందదు, పొందలేదు'. లండన్ ఘటన సంభవించిన రెండు దశాబ్దాల అనంతరం భారత్‌లో యువ విప్లవకారుల 'హింసారాధన'ను గాంధీ ఎదుర్కోవలసి వచ్చింది. శ్వేత జాతీయులైన అధికారులను హతమార్చడమే దేశం నుంచి బ్రిటిష్ వారిని వెళ్లగొట్టేందుకు ఏకైక మార్గమని ఆ యువ విప్లవకారులు విశ్వసించారు. 'ఒంటరిగా పాల్పడే సాహసోపేత చర్యల వల్ల ఒక పరాధీన దేశం స్వాతంత్ర్యం పొందలేదని' ఆ యువ విప్లవకారులకు గాంధీ నచ్చచెప్పారు. స్వేచ్ఛా మందిరం నిర్మాణానికి వేలాది స్త్రీ పురుషుల, యువజనుల, వృద్ధుల సంఘటిత నిర్మాణాత్మక ప్రయత్నాలు అవసరమని ఆయన అన్నారు. దేశ స్వాతంత్ర్యం లేదా సమాజంలో మార్పు కోసం ప్రాణాలు అర్పించడానికి వెనుకాడని యువ విప్లవకారుల ధైర్య సాహసాలను ఆయన అంగీకరించారు. అయితే సాయుధ విప్లవాలతో ప్రపంచం విసుగు చెందిందని గాంధీ అభిప్రాయపడ్డారు. అహింసాయుత పోరాటం ద్వారా ప్రభావవంతమైన మార్పును సాధించవచ్చని మహాత్ముడు అన్నారు. స్వరాజ్‌కు గాంధీ విశిష్ట నిర్వచనమిచ్చి వంద సంవత్సరాలకు పైగా గడచిపోయింది. మరి ప్రస్తుత కాలంలో ఆ భావన, నాలుగు మూలస్తంభాలు ఎలా ఉన్నాయి? స్వతంత్ర భారతదేశ రాజ్య వ్యవస్థ విధులు, బాధ్యతల విషయమై గాంధీ స్వయంగా ఎప్పుడూ ఆలోచించలేదు. అయితే పాలనా పద్ధతులను విమర్శించేవారిని సంవత్సరాల తరబడి జైలులో ఉంచడానికి ప్రస్తుతం అమలులో ఉన్న శిక్షార్హమైన చట్టాలు, వాటి దుర్వినియోగంపై ఆయన తప్పకుండా దిగ్భ్రాంతి చెందేవారు. దేశ ప్రజల్లో మతపరమైన విభేదాలు సృష్టించేలా ఉంటున్న హోంమంత్రి, ప్రధానమంత్రి, అసోం, యూపీ, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల ముఖ్యమంత్రుల ప్రసంగాలు, వ్యాఖ్యలకు ఆయన తప్పకుండా భీతావహుడు అయ్యేవారు. పూర్తిగా అహింసాయుత పద్ధతులకు కట్టుబడి సూత్రబద్ధంగా సాగుతున్న ఉద్యమాలు, మరీ ముఖ్యంగా పౌరసత్వ సవరణ చట్ట వ్యతిరేక నిరసనలు, రైతుల పోరాటాలు, పర్యావరణ ఉద్యమాలు, ఇటీవలి విద్యార్థుల ఆందోళనలను ఆయన తప్పక అభినందించేవారు. దళితులు, మహిళలు, మైనారిటీలకు సమానహక్కులు, సమత్వ, సుస్థిర ఆర్థికాభివృద్ధి నమూనా, మనసా, వాచా, కర్మణా అహింసను ఆచరించడం-- స్వేచ్ఛకు ఇవే అత్యంత ఆవశ్యకమైన నిబంధనలుగా మిగిలి ఉన్నాయి. వర్తమాన భారతదేశంలో గాంధీ స్వరాజ్ నాలుగు మూల స్తంభాలలో ప్రతి ఒక్కటీ బలహీనపడిపోయింది. ప్రభుత్వ చర్యల వల్లే కాకుండా అనేక సందర్భాలలో పౌరుల చర్యల వల్ల కూడా మరింత బలహీనపడ్డాయి. గాంధీ ఊహించిన స్వరాజ్ నిర్మాణం ఇంకా కూలిపోనప్పటికీ అది ఎంత మాత్రమూ బలంగా, స్థిరంగా లేదు.

ఆదివారం 4 అక్టోబర్ 2026
అగ్నిధార

# ఆదివాసీల సాగు భూముల్లో మొక్కలు నాటితే ఊరుకోం

**అటవీ శాఖ దౌర్జన్యాలు ఆపాలి**
**: భాగాల రాజన్న**

అగ్నిధార న్యూస్ ,(నేన్నెల) :

ఆదివాసీల సాగు భూముల్లో అటవీ శాఖ అధికారులు ప్లాంటేషన్ చేపడితే సహించేది లేదని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు భాగాల రాజన్న హెచ్చరించారు.మండలంలోని కోనంపేట గ్రామంలో ఆదివాసీ రైతులు సాగు చేస్తున్న పోడు భూముల్లో మొక్కలు నాటేందుకు అటవీ శాఖ చర్యలు చేపడుతోందని ఆరోపించారు.ఏళ్లుగా ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూముల్లో పంటలను పశు వులతో మేపించడం, ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడిన అధికారులు, ఇప్పుడు భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్లాంటేషన్ ఏర్పాటు చేస్తున్నారని రాజన్న ఆరోపించారు. తమ సాగు భూములను వదిలి మరోచోట ప్లాంటేషన్ చేపట్టాలని ఆదివాసీలు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.అటవీ హక్కుల చట్టం--2006 ప్రకారం అర్హులైన ఆదివాసీల సాగు భూములను సర్వే చేసి హక్కు పత్రాలు అందించాలని డిమాండ్ చేశారు. గ్రామ అటవీ హక్కుల కమిటీ ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటివరకు సాగు భూముల సర్వే జరగలేదన్నారు.ఆదివాసీల హక్కులను గుర్తించి పట్టాలు ఇవ్వాలని కోరారు. సాగు భూముల్లో మొక్కలు నాటే నిర్ణయాన్ని అటవీ శాఖ విరమించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి భోగారపు మల్లేష్, ఉపాధ్యక్షులు జంపము లచ్చన్న, జంబి లక్ష్మయ్య, బండి బాపు, మంగిరి మాధవి, ధర్మయ్య, లక్ష్మి, మారక్క, వనిత, శంకర్‌తో పాటు పలువురు ఆదివాసీలు పాల్గొన్నారు.



## ఆర్టీఐ సమాచారాన్ని ఇవ్వకుంటే చర్యలు తప్పవు

**రామగుండం కార్పొరేషన్ అధికారుల తీరుపై సమాచార హక్కు కమిషన్ అసంతృప్తి**

అగ్ని ధార న్యూస్,( రామగుండం) :

సమాచార హక్కు చట్టం కింద కోరిన సమాచారాన్ని నిర్ణీత గడువులో అందించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ హెచ్చరించినట్లు ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ తెలిపారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ నిర్మాణాలు, అక్రమ నిర్మాణాలకు సంబంధించిన సమాచారంపై తాను దాఖలు చేసిన అప్పీల్‌పై శనివారం సమాచార హక్కు కమిషన్ కార్యాలయంలో విచారణ జరిగినట్లు పేర్కొన్నారు.విచారణకు హాజరైన దినేష్ తన వాదనలు వినిపించారు. నిర్ణీత సమయంలో సమాచారం అందించకపోవడంపై కమిషన్ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. సమాచార హక్కు చట్టం ప్రజలకు కల్పించిన హక్కు అని, ప్రజలు కోరిన సమాచారాన్ని చట్ట నిబంధనల ప్రకారం అందించడం అధికారుల బాధ్యత అని కమిషనర్ స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. ప్రజా సంబంధిత సమాచారాన్ని పారదర్శకంగా అందించాలని సూచించిన కమిషన్.. సమాచారం ఇవ్వడానికి మరో 15 రోజుల గడువు ఇచ్చినట్లు దినేష్ తెలిపారు. అప్పటికీ సమాచారం అందించకపోతే సంబంధిత ప్రజా సమాచార అధికారులకు వివరణ కోరుతూ నోటీసులు జారీ చేయడంతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించినట్లు పేర్కొన్నారు.

## ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమం

**'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా నిర్వహణ**

అగ్నిధార న్యూస్ ,(రామగుండం):

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా శ్రీరామచంద్ర మిషన్‌లోని శివాలయం, హనుమాన్ ఆలయ పరిసరాల్లో శనివారం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. జిల్లా లేబర్ సెల్ కో-కన్వీనర్ ఎల్తూరి రాజయ్య ఆధ్వర్యంలో, లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఆలయ పరిసరాల్లోని పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ఆలయ విగ్రహాలను శుద్ధి చేసి భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు దేశవ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు. 'స్వచ్ఛ భారత్' స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో లేబర్ సెల్ జిల్లా కన్వీనర్ తడగొండ నరసయ్య, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మచ్చ విశ్వాస్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు ఎల్తూరి సరిత, చిలుముల నరేందర్, జక్కుల పద్మ, కోడూరు రమేష్, జక్కుల ప్రవీణ్, గజ్జల భాస్కర్, జక్కన బాలు, సిలారపు కళ్యాణ్, బెక్కం స్వప్న, బుంగ మహేష్, అక్కపాక రాజేష్ తదితరులు పాల్గొన్నారు

## నిట్టూరులో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి) :

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, ఎమ్మార్పీఎస్ పెద్దపల్లి మండల ఇన్‌చార్జి పల్లె బాపు మాదిగ ఆధ్వర్యంలో నిట్టూరు గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆరెపల్లి వెంకటరాజం మాదిగ, గౌరవ సలహాదారుగా మంథని ప్రభాకర్ మాదిగ, అధ్యక్షుడిగా బదుగు నవీన్ మాదిగ, అధికార ప్రతినిధిగా కాంపెల్లి శంకర్ మాదిగ, ప్రధాన కార్యదర్శులుగా బదుగు విజయ్ మాదిగ, ఆసంపల్లి రాజేశం మాదిగ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఇరుగురాల కిరణ్ మాదిగ, ఇరుగురాల గట్టయ్య మాదిగ, కాంపెల్లి రాజ్‌కుమార్ మాదిగ, కోశాధికారిగా ఇరుగురాల శ్రీధర్ మాదిగను ఎన్నుకున్నారు.

కార్యదర్శులుగా ఆసంపల్లి ఆనందం మాదిగ, ఇరుగురాల సర్వయ్య మాదిగ, ఇరుగురాల లక్ష్మయ్య మాదిగ, మొలుమూరి శ్రావణ్ మాదిగ, సహాయ కార్యదర్శులుగా జక్కినపల్లి మహేష్ మాదిగ, బదుగు లింగయ్య మాదిగ, ఆసంపల్లి పోచయ్య మాదిగ, ఆసంపల్లి సురేందర్ మాదిగ, జాగేటి రమేష్ మాదిగ తదితరులు ఎన్నికయ్యారు. నూతన కమిటీ గ్రామంలో ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయాలని పల్లె బాపు మాదిగ సూచించారు.

## ప్రమాద బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ చొరవతో రూ. ఆర్థికసాయం**

అగ్ని ధార న్యూస్,( రామగుండం):

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ పీకే రామయ్య కాలనీకి చెందిన డాంగి సంతోష్ ఇటీవల ప్రమాదంలో గాయపడి వైద్య చికిత్స పొందుతున్నాడు. చికిత్స ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం ఆర్థిక సాయం మంజూరు చేసింది. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం 1వ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ బాధితుడు సంతోష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందన్నారు. ప్రమాదంలో గాయపడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంతోష్ కుటుంబానికి ఈ సాయం కొంత ఊరటనిస్తుందని పేర్కొన్నారు.

చెక్కు మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు, చెక్కును అందజేసిన కార్పొరేటర్ విజయ మల్లేష్‌కు సంతోష్, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణకు సన్మానం

అగ్ని ధార న్యూస్ ,(హైదరాబాద్):

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణకు రామగుండం మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్ ఘనంగా సన్మానం చేశారు.కమిషన్ సభ్యుడిగా మూడేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయంలో శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ పూలబొకే అందజేసి, శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా కన్నూరి సతీష్‌కుమార్ మాట్లాడుతూ కొంకటి లక్ష్మీనారాయణ రామగుండం తొలి మేయర్‌గా సేవలందించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా మూడేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకోవడం అభినందనీయమన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పలు అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేశారని పేర్కొన్నారు.కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన వివిధ వర్గాల నాయకులు రఫీభాయ్, మేడిపల్లి శ్యాంసుందర్, వేణుగోపాల్‌రావు, భానుప్రకాష్, కేకే స్వామి, సంతోష్‌రెడ్డి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## డిఫెన్స్ మద్యం బాటిళ్ల స్వాధీనం

అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):



గాంధీ జయంతి సందర్భంగా అమలులో ఉన్న మద్యం విక్రయ నిషేధ దినంలో డిఫెన్స్ (ఆర్మీ) మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై పెద్దపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు దాడి చేసి 29 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పై అధికారుల ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వర్, పెద్దపల్లి ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది శుక్రవారం పెద్దకాల్వలలో విశ్వసనీయ సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 750 మిల్లీలీటర్ల సామర్థ్యం కలిగిన 29 డిఫెన్స్ మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. వీటిలో పీటర్ స్కాచ్--8, బ్లెండర్స్ ప్రైడ్--10, సిగ్నేచర్--11 బాటిళ్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు.సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వర్, పెద్దపల్లి ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ దామోదర్‌శెట్టి తెలిపారు. గుడుంబా, అక్రమ మద్యం విక్రయాలపై సమాచారం ఉంటే ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని వారు కోరారు.దాడిలో ఎస్ఐ దామోదర్, హెడ్‌కానిస్టేబుళ్లు సందీప్, తిరుపతి, కానిస్టేబుళ్లు డి.సురేష్, బి.నవీన్, పి.నాగరాజు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ కార్మిక ఐక్యతను బలోపేతం చేయాలి

**సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి**

అగ్ని ధార న్యూస్,( రామగుండం):

కార్మికులకు గౌరవప్రదమైన పని, మెరుగైన జీవన పరిస్థితులు కల్పించేందుకు పోరాటాలను బలోపేతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌టీయూ) 81వ వార్షికోత్సవం సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సమస్యలు, డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు.కుమారస్వామి మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం మానవాళి సంక్షేమానికి ఉపయోగపడేలా ఆర్థిక విధానాలు ఉండాలన్నారు.కార్మికులకు ఉపాధి భద్రత, సామాజిక భద్రత కల్పించాలని, పని గంటలను తగ్గించి వారానికి 35 గంటలు, రోజుకు 7 గంటల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్ ఉపాధి స్థానంలో శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని కోరారు.యుద్ధాలు, విధ్వంసానికి వ్యతిరేకంగా ప్రపంచ శాంతి కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలని అన్నారు. గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఖండించారు. కార్మికులపై శ్రమ దోపిడీ, పెరుగుతున్న పని భారాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బండ రాజయ్య, అంజయ్య, కచ్చు మల్లేష్, రాజు, వినోద్, శ్రీనివాస్, రవి, కాసారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఓవర్సీస్ విద్యానిధి దరఖాస్తుల గడువు పొడిగింపు

**అక్టోబర్ 15 వరకు అవకాశం**
**బీసీ, ఈబీసీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి**

అగ్నిధార న్యూస్,(పెద్దపల్లి) :

మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి పథకం 2026 ఆగస్టు/సెప్టెంబర్ దశకు దరఖాస్తుల సమర్పణ గడువును అక్టోబర్ 15 వరకు పొడిగించినట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రవీందర్ తెలిపారు. గతంలో సెప్టెంబర్ 30గా ఉన్న గడువును మరో 15 రోజులు పొడిగించినట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.విదేశాల్లో మాస్టర్స్, డాక్టరేట్ స్థాయిలో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే అర్హులైన బీసీ, ఈబీసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారుల కుటుంబ వార్షిక ఆదాయం అన్ని వనరులు కలిపి రూ.5 లక్షల్లోపు ఉండాలని, వయస్సు 35 సంవత్సరాలకు మించకూడదని తెలిపారు. డిగ్రీలో 60 శాతానికి పైగా మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు.అలాగే జీఆర్ఈలో 260 లేదా జీమ్యాట్‌లో 500 మార్కులు సాధించి ఉండాలని, ఇంగ్లిష్ భాషా అర్హత పరీక్షల్లో టోఫెల్‌లో 60, ఐఈఎల్‌టీఎస్‌లో 6.0 లేదా పీటీఈలో 50 మార్కులు సాధించి ఉండాలని తెలిపారు.అర్హత కలిగిన విద్యార్థులు అక్టోబర్ 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు విధానం, అర్హతలు, ఇతర వివరాల కోసం తెలంగాణ ఈ-పాస్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని రవీందర్ కోరారు.

## కాంట్రాక్టు కార్మికులకు 10 శాతం లాభాల వాటా చెల్లించాలి

**భూపాలపల్లి జీఎం కార్యాలయం ఎదుట ధర్నా**

అగ్ని ధార న్యూస్ ,(భూపాలపల్లి), :

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు 2025--26 ఆర్థిక సంవత్సరంలో సంస్థకు వచ్చిన లాభాల్లో 10 శాతం వాటా చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి.బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకన్న డిమాండ్ చేశారు.శనివారం భూపాలపల్లి సింగరేణి జీఎం కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగరేణి లాభాలను ఆరు నెలలు గడిచినా ప్రకటించలేదన్నారు.సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలని కోరారు. సింగరేణిలో సుమారు 42 వేల మంది శాశ్వత కార్మికులతో పాటు 35 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు.శాశ్వత కార్మికులతో సమానంగా కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నప్పటికీ తక్కువ వేతనాలు పొందుతున్నారని పేర్కొన్నారు. సంస్థకు లాభాలు రావడంలో కాంట్రాక్టు కార్మికుల శ్రమ కూడా కీలకమని, అందువల్ల లాభాల్లో 10 శాతం వాటాను వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు.ధర్నాలో వెంకటలక్ష్మి, ఈశ్వరమ్మ, నర్సింగ్, జిట్టా వేణి, శంకర్, ఎస్.సతీష్, కె.శంకర్, గడ్డం నరేష్, జె.రవి, జె.నాంపెల్లి, డి.సతీష్, ఎన్.వెంకటేష్, శంకర్ దయాళ్ తదితరులు పాల్గొన్నారు.

## రామగిరి ఖిల్లాలో అనుమానాస్పద కార్యకలాపాలపై విచారణ జరపాలి



**బీజేపీ నాయకుడు మొలుమూరి శ్రీనివాస్ డిమాండ్**

అగ్ని ధార న్యూస్ ,(రామగిరి) :

చారిత్రక రామగిరి ఖిల్లా ప్రాంతంలో ఇటీవల చోటుచేసుకున్నట్లు చెబుతున్న అనుమానాస్పద కార్యకలాపాలపై సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.కొంతమంది వ్యక్తులు ఖిల్లా ప్రాంతంలో జెండాలు ఏర్పాటు చేయడం, పూజా కార్యక్రమాలు నిర్వహించడం, జంతుబలి ఇచ్చినట్లు, కొన్ని ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టినట్లు సమాచారం వస్తోందన్నారు.చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రాంతంలో ఇటువంటి కార్యకలాపాలకు ఎవరి అనుమతి ఉందో, ఎవరు నిర్వహించారో, వాటి ఉద్దేశం ఏమిటో అధికారులు నిగ్గుతేల్చాలని కోరారు. రామగిరి ఖిల్లా చారిత్రక వారసత్వ సంపదగా ఉన్నందున అనుమతులు లేకుండా ఎలాంటి కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.అధికారులు స్పందించకపోతే ఖిల్లా పరిరక్షణ, ఘటనకు సంబంధించిన వాస్తవాల వెలికితీత కోసం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్తామని శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సెంటనరీ కాలనీ అధ్యక్షుడు తీగల శ్రీధర్, మెరుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షల సంస్కరణల్లో మరో ముందడుగు



**మంథనిలో 9వ తరగతి జవాబు పత్రాల బాహ్య మూల్యాంకనం**

అగ్ని ధార న్యూస్, ( మంథని):

పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే లక్ష్యంతో 9వ తరగతి ప్రథమ సమ్మేటివ్ పరీక్షల జవాబు పత్రాలకు బాహ్య మూల్యాంకనం చేపట్టారు. ఇందులో భాగంగా మంథని మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థుల గణిత జవాబు పత్రాల మూల్యాంకన శిబిరాన్ని శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. మండల విద్యాధికారి దాసరి లక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, ప్రధాన మూల్యాంకనకర్త గీట్ల భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రక్రియ ప్రారంభమైంది. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఎంపికైన గణిత ఉపాధ్యాయులు మూల్యాంకనంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎల్.శ్రీనివాస్, గుంజపడుగు ఉన్నత పాఠశాల స్వామి, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఎస్.శ్రీనివాస్, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలకు చెందిన సీహెచ్.శ్రీనివాస్, బి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంపిక చేసిన జిల్లాల్లో 6, 9వ తరగతుల ప్రథమ, ద్వితీయ సమ్మేటివ్ పరీక్షల జవాబు పత్రాలకు బాహ్య మూల్యాంకనం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

## పీఆర్టీయూ--టీఎస్ జిల్లా అధ్యక్షుడిగా గండు కృష్ణమూర్తి

**ప్రధాన కార్యదర్శిగా కానుగంటి శ్రీనివాస్ ఎన్నిక**

అగ్ని ధార న్యూస్,( రామగుండం):

పీఆర్టీయూ--టీఎస్ పెద్దపల్లి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. రెండేళ్ల పదవీకాలానికి జిల్లా అధ్యక్షుడిగా గండు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా కానుగంటి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గతంలోనూ వీరిద్దరూ ఇదే బాధ్యతలను నిర్వహించారు.

ఎన్నికలకు ముందు జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పుల్గం దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్షం గౌడ్ పాల్గొన్నారు.ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. త్వరలో వేతన సవరణ సంఘం ఏర్పాటు, వచ్చే వేసవిలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్ సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికల అధికారులు జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆనందరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. నూతన అధ్యక్షుడు గండు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు, సంఘం నాయకులు అభినందించారు.కార్యక్రమంలో పలువురు జిల్లా, రాష్ట్ర, మండల కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు, సీనియర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చికిత్సకు రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరు

అగ్ని ధార ,(రామగిరి):

అనారోగ్యంతో బాధపడుతున్న రామగిరి మండలం చందనపూర్‌కు చెందిన లక్కాకుల రాజకుమారికి వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ. 2.50 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ)ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంజూరు చేయించారు.హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజకుమారి కుటుంబ సభ్యులు వైద్య సహాయం కోసం మంత్రిని కోరగా, ఆయన స్పందించి నిధులు మంజూరు చేయించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన ఆసుపత్రి సహాయకులు ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా తమకు అండగా నిలిచిన మంత్రి శ్రీధర్‌బాబుకు రాజకుమారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# పిల్లల బాధ్యతను గుర్తుచేసిన 'తిరగబడ్డ మమకారం'

**లఘుచిత్రాన్ని ఆవిష్కరించిన డీసీపీ రామ్‌రెడ్డి, ఏసీపీ రమేష్**

అగ్నిధార న్యూస్,(రామగుండం) :

తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన ఆస్తులను అనుభవిస్తూ, వృద్ధాప్యంలో వారిని వృద్ధాశ్రమాలకు పంపించే పిల్లలకు 'తిరగబడ్డ మమకారం' లఘుచిత్రం కనువిప్పు కలిగిస్తుందని పెద్దపల్లి డీసీపీ రామ్‌రెడ్డి, గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ అన్నారు. శనివారం గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో లఘుచిత్రాన్ని యూట్యూబ్‌లో ఆవిష్కరించి, విద్యార్థులకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల ఆలనాపాలన చూసుకోవడం పిల్లల బాధ్యత అని తెలిపారు. వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిపై యువతకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజానికి చక్కటి సందేశాన్ని అందించేలా లఘుచిత్రాన్ని రూపొందించిన చిత్రబృందాన్ని అభినందించారు. కళాశాల విద్యార్థులకు చిత్రాన్ని ప్రదర్శించడం సముచిత నిర్ణయమన్నారు. లఘుచిత్రంలో మేజిక్ రాజా, రజితతోపాటు పోతు శంకరయ్య, సతీష్, శ్రీలత, సిరిపురం శ్రీనివాస్, అంజిబాబు తదితరుల నటనను అతిథులు ప్రశంసించారు. దర్శకుడు చంద్రపాల్ మొబైల్ ఫోన్‌తోనే



చిత్రీకరణ, డబ్బింగ్, రీ-రికార్డింగ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. మరిన్ని సామాజిక సందేశాత్మక లఘుచిత్రాలను రూపొందించాలని సూచించారు. దర్శకుడు చంద్రపాల్ మాట్లాడుతూ.. సమాజహితమైన సందేశాత్మక చిత్రాలను రూపొందించాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్మూరి అమరేందర్‌రావు, డాక్టర్ అనిల్‌కుమార్ దామెర, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సాంబశివరావు, సీనియర్ పాత్రికేయుడు దయానంద్‌గాంధీ, కళాకారులు, పాత్రికేయులు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

**రూ.75 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన**
**మౌలిక వసతులపై ఎమ్మెల్యే కసిరెడ్డి పరిశీలన**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, ఎల్‌ఓసీ పత్రాలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు. అనారోగ్యంతో వైద్య చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం పలువురు ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శాలువాలతో సత్కరించి అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**రూ.75 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన**

అనంతరం ఆమనగల్ పట్టణంలోని వెంట తండాలో రూ.75 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. పట్టణం, తండాల్లో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన**

తదుపరి ఆమనగల్ ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి కీలకమని పేర్కొన్నారు. ఆసుపత్రి భవన నిర్మాణాన్ని నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

**బస్టాండ్ పరిసరాల్లో రోడ్డు పక్కన షట్టర్ల పరిశీలన**

ఆమనగల్ పట్టణంలోని బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో రోడ్డు పక్కన ఉన్న షట్టర్లను కూడా ఎమ్మెల్యే పరిశీలించారు. రహదారులపై ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులతో చర్చించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గేలా, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆమనగల్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపట్టి, వాటిని సకాలంలో పూర్తి చేసేలా అధికారులతో సమన్వయం చేసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు తల్లోజు ఆచారి, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి పుట్టినరోజు వేడుకలకు హాజరైన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కడ్తాల్ మండలంలోని గోవిందాయపల్లి తండాలో గోపాల్ రాథోడ్ కుమార్తె రెండవ పుట్టినరోజు వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ పుట్టినరోజు వేడుకలకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారిని ఆప్యాయంగా ఆశీర్వదించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. చిన్నారి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని కుటుంబ సభ్యులను అభినందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిని గోపాల్ రాథోడ్ కుటుంబ సభ్యులు, స్థానికులు సాదరంగా ఆహ్వానించారు. వేడుకల సందర్భంగా చిన్నారికి శుభాకాంక్షలు తెలుపుతూ పలువురు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో, సర్పంచ్‌లు బాణావత్ తేజీరాం నాయక్, రామచందర్ నాయక్, వార్డు సభ్యుడు సికిందర్, సీనియర్ నాయకులు హర్యా, వీరయ్య, విష్ణు, జలాల్, రమేష్ యాదవ్, విగ్నేష్, హరి, తల్లోజు రఘు, మల్లేష్ నాయక్, భాస్కర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులను కించపరిచేలా మాట్లాడారంటూ నిరసన..

**మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి ఆర్యవైశ్యులను కించపరిచేలా మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మాట్లాడారని ఆరోపిస్తూ కల్వకుర్తి పట్టణంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎడ్మ సత్యం తీరును నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేశారని ఆరోపించిన సంఘం నాయకులు. ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాజంలోని ఏ వర్గాన్నీ కించపరిచే విధంగా మాట్లాడటం సరికాదని, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు ప్రజల మనోభావాలను గౌరవించాలని వారు పేర్కొన్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం నాయకులు కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంపై ఫిర్యాదు చేశారు. ఆర్యవైశ్యులను కించపరిచేలా చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలపై విచారణ చేపట్టి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ,తమ సామాజిక వర్గాన్ని అవమానించేలా ఎవరైనా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని అన్నారు. ఆర్యవైశ్యుల గౌరవం, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. పోలీసులకు అందించిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు బచ్చు రామకృష్ణ,పాపి శెట్టి రామ్, ఆమనగల్ పి ఎ సి ఎస్ చైర్మన్ గంప వెంకటేష్ ,అన్ని మండలాల ఆర్యవైశ్య సంఘం నాయకులు, దాచేపల్లి శ్రీను,గోవిందు శ్రీను, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఖనిలో కేటీఆర్ సింగరేణి సభ

**సింగరేణి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కెటిఆర్ సభ**

అగ్నిధారన్యూస్ గోదావరిఖని03:

తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం కేంద్ర కార్యాలయం గోదావరిఖని లో శనివారం కేటీఆర్ సింగరేణి సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ?మాజీ మంత్రి, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై త్వరలో గోదావరిఖనిలో జరిగే కేటీఆర్ సింగరేణి సభ విజయవంతం చేసేందుకు కార్మికులను చైతన్యవంతులను చేయాలని సూచించారు. మెడికల్ బోర్డు నిర్వహణను వేగవంతం చేసి కార్మికులకు తగిన న్యాయం చేయాలని,?2025-26 సంవత్సరానికి సంబంధించి వాస్తవ లాభాల వాటాను కార్మికులకు అందించడం, అలవెన్సులు, పెర్క్ పై ఆదాయ పన్ను నుంచి మినహాయింపు కల్పించడం, సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం, జెన్కో నుంచి ?కార్మికులకు రావలసిన 60 వేల కోట్ల రూపాయల పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయడం.?సింగరేణి కార్మికుల సొంత ఇంటి నిర్మాణానికి మద్దతు, పథకాల అమలు, గనుల్లో అవసరమైన నూతన ఆధునిక యంత్రాలు, పనిముట్ల కొనుగోలు, ?సంస్థ భవిష్యత్తు, ఉపాధి అవకాశాల కోసం నూతన గనులను ప్రారంభించడం తదితర సమస్యల అమలుకై ఈ సందర్భంగా కోర్ కమిటీ నాయకులు చర్చించారు. ఈ సమావేశం లో టీబిజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి, సురేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నునె కొమరయ్య, అధికార ప్రతినిధి పర్లపెల్లి రవి, కోర్ కమిటీ సభ్యులు చెల్పూరి సతీష్, బడికెల సంపత్, ఆయిలి శ్రీనివాస్, మల్రాజు శ్రీనివాసరావు, మేడిపల్లి సంపత్, బండి రమేష్, బడతల సమ్మయ్య, జాఫర్, దేవ శ్రీనివాస్, దూట శేషగిరి, అవినాష్ రెడ్డి పాల్గొన్నారు.

## నూతన అధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ



అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి )"

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ( పిసిసి ) అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచనల మేరకు ఆందోల్ నియోజకవర్గం లోని అన్ని మండలాలకు, ఆందోల్ - జోగిపేట టౌన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆందోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా గంగాధర్ అశోక్, మునిపల్లి మండల అధ్యక్షులుగా లింగన్న గారి సతీష్ కుమార్, చౌటకూరు మండల అధ్యక్షులుగా బోడపట్ల గణేష్, పుల్కల్ మండల అధ్యక్షులుగా మల్లన్న గారి దుర్గారెడ్డి, రాయికోడ్ మండల అధ్యక్షులుగా పట్లోళ్ల కేదారినాథ్ , వట్పల్లి మండల అధ్యక్షులుగా వజినాల విశ్వాస్, ఆందోల్ - జోగిపేట టౌన్ అధ్యక్షులుగా డి జి వెంకటేశం , రేగోడు మండల అధ్యక్షులుగా ఎస్ దిగంబర్ రావు, అల్లాదుర్గ్ మండల అధ్యక్షులుగా కొప్పుల శేషారెడ్డి, టేక్మాల్ మండల అధ్యక్షులుగా పట్లోళ్ల విష్ణువర్ధన్ రెడ్డి లను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల, టౌన్ అధ్యక్షులుగా నియమితులైన పార్టీ నాయకులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియామక పత్రాలను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతంపై చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి పెద్ద ఎత్తున తీసుక వెళ్లాలని సూచించారు

## డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు..

**ఖాతాదారులు, గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: బ్యాంకు మేనేజర్ కూన రాఘవేందర్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ఖాతాదారుల పొదుపులను ప్రోత్సహించడంతో పాటు మెరుగైన వడ్డీ ఆదాయాన్ని అందించే ఉద్దేశంతో కల్వకుర్తి పట్టణంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్, మహబూబ్‌నగర్ కల్వకుర్తి శాఖ డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను అందిస్తున్నట్లు బ్యాంకు మేనేజర్ కూన రాఘవేందర్ తెలిపారు. ప్రస్తుతం బ్యాంకులో సీనియర్ సిటిజన్లకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 8.20 శాతం, రికరింగ్ డిపాజిట్లపై 8.60 శాతం వరకు వడ్డీ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఇతర ఖాతాదారులకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 7.60 శాతం, రికరింగ్ డిపాజిట్లపై 8.00 శాతం వరకు వడ్డీ రేట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తమ వద్ద అందుబాటులో ఉన్న ఈ డిపాజిట్ పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా కల్వకుర్తి పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తమ పొదుపు మొత్తాలను సురక్షితంగా పెట్టుబడి పెట్టి, అందుబాటులో ఉన్న ఆకర్షణీయమైన వడ్డీ ప్రయోజనాలను పొందాలని కోరారు. ప్రజల పొదుపులకు భద్రతతో పాటు తగిన వడ్డీ ఆదాయం అందించేందుకు బ్యాంకు ద్వారా వివిధ డిపాజిట్ పథకాలు అందుబాటులో ఉన్నాయని మేనేజర్ కూన రాఘవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. డిపాజిట్ పథకాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం కల్వకుర్తి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు శాఖను సంప్రదించాలని ఆయన కోరారు.

## సింగోటం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:



సింగోటం స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శనివారం కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సతీమణి శారదారెడ్డి, కుమారుడు నవనీత్‌రెడ్డితో కలిసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వేద బ్రాహ్మణులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందించారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

## 30 అడుగుల రోడ్డు పేరుతో ఇళ్ల తొలగింపా?

**ఎన్‌టీఆర్ నగర్‌లో మున్సిపల్ చర్యలపై స్థానికుల ఆందోళన**

అగ్నిధార న్యూస్,( రామగుండం):

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 57వ డివిజన్ ఎన్‌టీఆర్ నగర్‌లో రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్ల తొలగింపునకు అధికారులు ప్రయత్నించారని స్థానికులు ఆరోపించారు. శనివారంనంబర్ ప్లేట్లు లేని జేసీబీలతో అధికారులు వచ్చి నిర్మాణాన్ని కూల్చేందుకు ప్రయత్నించారని, దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపారు. తమ ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఉన్నాయని చెబుతున్న బాధితులు.. కూల్చివేతకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు, 30 అడుగుల రోడ్డుకు సంబంధించిన అనుమతులు, టెండర్ పత్రాలను చూపించాలని అధికారులను ప్రశ్నించినట్లు పేర్కొన్నారు. అయితే స్పష్టమైన పత్రాలు చూపకపోవడంతో జేసీబీలు వెనుదిరిగాయని తెలిపారు. పేదల ఇళ్లను తొలగించే ముందు సంబంధిత నిబంధనలు, అనుమతులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మున్సిపల్ అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాలని కోరారు. రోడ్డు అభివృద్ధి అవసరమైతే చట్టబద్ధమైన ప్రక్రియ పాటించాలని, అనుమతులు ఉన్న ఇళ్ల విషయంలో తమకు న్యాయం చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

## పీఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజిలీ యోజన పథకంపై అవగాహన

అగ్నిధారన్యూస్ గోదావరిఖని3

ప్రతి ఇంటి పై సోలార్ పలకలు అమర్చుకొని విద్యుత్ ఉత్పత్తి చేసి తాము ఉచితంగా పొందడంతో పాటు ఎన్ పి డి సి ఎల్ కు విక్రయించి ఆదాయం ఆర్జించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి సూచించారు,పి.ఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజిలీ యోజన పథకంపైశారదానగర్,ఇఆర్ ఓ కార్యాలయంలో ఎన్ పి డి సి ఎల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు, నీళ్ళ కొరతతో విద్యుత్ ఉత్పత్తి ఖర్చు పెరగుతుండడంతో పాటు డిమాండ్ కు తగ్గ సరఫరా లేదని. ఒక్కో యూనిట్ కు పది రూపాయలకు పైగా వెచ్చించిఇతర రాష్ట్రాల నుండి కొనుగోలు చేస్తూ ప్రజలపైభారశీ పడకుండా ప్రభుత్వం తక్కువ రేటుకు మనకు అందజేస్తుందని, ప్రతి ఇంటిపై సోలార్ పలకలు అమర్చుకొని ఉచితంగా లభించే సూర్యరశ్మిని సద్వినియోగం చేసుకొని విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడమే ఉత్తమ మార్గమని అన్నారు. ఇంటిపై సోలార్ పలకలు అమర్చుకోవడాన్ని ప్రోత్సహించడానికై ప్రభుత్వశీ పి ఎం సూర్య ఘర్ ముఫ్తి బిజిలి యోజన కింద రూ 78,000/- వరకు సబ్సిడీ అందిస్తున్నదని, అంతేకాకుండా మిగిలిన ఖర్చుకు అవసరమైన సొమ్ముకు కూడా బ్యాంకులు రుణం మంజూరు చేస్తూ తక్కువ వడ్డీకి నెలసరివాయిదాలలో చెల్లించే అవకాశం కూడా కల్పిస్తున్నారని అన్నారు. ఈ విషయంపై ఎన్ పి డి సిఎల్ సిబ్బంది ఇంటింటా తిరుగుతూ అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దాసరి సాంబ మూర్తి , ఎన్ పి డి సి ఎల్ సంస్థ డి ఇ ఇ ప్రభాకర్ , ఎ డి ఇ లు గుండు శ్రీనివాస్ , ఇ . రమేష్ , ఎన్ పి డి సి ఎల్ అధికారులు , సిబ్బంది, పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.

## ఎల్ ఎస్ ఎన్ కంపెనీ వేతన బకాయిలు చెల్లించాలని కార్మికుల ఆందోళన.

అగ్నిధారన్యూస్ గోదావరిఖని3

టేకులపల్లి కోయగూడెం ఓ బి పనులను నిర్వహించిన ఎల్ ఎస్ ఎన్ కంపనీ యాజమాన్యం కార్మికులకు రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని శనివారం రోజున కార్మికులు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎల్‌ఎస్‌ఎన్ క్యాంపు లో ఆందోళన నిర్వహించారు ఈ సందర్భంగా కార్మికులు ఎల్‌ఎస్‌ఎన్ యాజమాన్యులను తమ హక్కులు వేతనాలు బోనస్ ఈపీఎఫ్ లపై నిలదీశారు మాకు చెల్లిస్తామన్న వేతనాల బకాయిలు వాయిదాల మీద వాయిదాలు పెట్టి వాయిదా లు గడిచిపోతున్నప్పటికిని మాకు ఇవ్వకపోవడం ఏమిటని మండిపడ్డారు. ఇట్టి విషయంలో తక్షణమే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో అతిపెద్ద పండుగ దసరా సమీపిస్తున్న మాకు రావాల్సిన బకాయిలను చెల్లించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు చెల్లించేంతవరకు ఇక్కడ నుండికదిలేదిలేదని, విషయము తెలుసుకున్న బోడు ఎస్‌ఐ రాజమౌళి ఎల్ ఎస్ ఎన్ క్యాంపుకు చేరుకొని కార్మికులతో కార్మిక సంఘాల నాయకులు ఎల్‌ఎస్‌ఎన్ యాజమాన్యంతో చర్చించారు .ఇట్టి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఎస్సైకి ఎల్‌ఎస్‌ఎన్ ప్రతినిధులు వివరించారు. మా సమస్య పరిష్కారం కానంత వరకు ఇక్కడ నుండి కదిలేది లేదని, కార్మికులు అక్కడే మకాం వేసి కూర్చున్నారు. కార్మికులకు

రావాల్సిన బకాయిలను ఇప్పించే విధంగా సింగరేణి యాజమాన్యం పోలీస్ అధికారులు చొరవ చూపాలని ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు ప్రసాద్ ఐ ఎన్ టి యు సి నాయకులు బానోతు నరేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బానోతు శంకర్ ,రఘురాం, శ్రీను, గోపాల్ ,గన్నా. వీరన్న. గోపి,ప్రసాద్, మోహన్. కటారి బాబు. తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికార యంత్రాంగంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆర్టిఐ కమిషనర్.

**సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన కమిషనర్**

అగ్నిదారన్యూస్ గోదావరిఖనిఅక్టోబర్3:

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ లోని వివిధ నిర్మాణాలు, అక్రమ నిర్మాణాల సమాచారాన్ని సమాచార హక్కు చట్టం (ఆర్.టి.ఐ)కింద ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ దాఖలు చేసిన అప్పీల్‌పై నేడు శనివారం రోజున తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ కార్యాలయం లో విచారణ జరిగింది. ఈ విచారణకు ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు దినేష్ హాజరై తన వాదనలు వినిపించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను కోరిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో ఇవ్వకుండా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ,సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ నిర్లక్ష్య ధోరణి వహిస్తూ, నియంతృత్వంగ వ్యవహరిస్తుందని, అడిగిన సమాచారన్ని అందించడంలో ఎందుకు జంకుతున్నారో అర్థం కాని పరిస్థితి అని అడిగిన సమాచారాన్ని అందించకపోవడంపై విచారణ సందర్భంగా కమిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు మద్దెల దినేష్ తెలిపారు. సమాచారం హక్కు చట్టం కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు కల్పించిన హక్కు అని, ప్రజలు కోరిన సమాచారాన్ని చట్టప్రకారం అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందనిఆయనపేర్కొన్నారు. ప్రజా సమస్యలకు సంబంధించినసమాచారాన్నిఅధికారులుదాచిపెట్టకుండాపారదర్శకంగా అందించాలని డిమాండ్ చేశారు. ఆర్టీఐ చట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత,జవాబుదారీతనం పెంపొందించేందుకు ముందుకు సాగాలన్నారు. డిసెంబర్ 25న సమాచారాన్ని కోరితే 30రోజుల్లో సమాచారం ఇవ్వాలని, తెలియదా అని అధికారులనునీలాదీశారు. అదే విధంగా ఇట్టి సమాచారాన్ని మెదటి అప్పిల్ దరఖాస్తు పెట్టినప్పటికి కూడ స్పదించలేకపోయారని దీనికి అయిన తివ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసారని, మరియు మీకు భారీగా ఫైన్లు తప్పవని మరియు మరొక 15రోజులు గడువు ఇస్తున్నాని,అయినప్పటికీ సమాచారం ఫిర్యాదు దారుడికి అందించకపోతే కార్పొరేషన్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులకు షోకాజ్ నోటీస్ లు జారి చేస్తామని కమిషన్ హెచ్చరించిందని దినేష్ పేర్కొన్నారు.

## దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించిన ధ్యాప నిఖిల్ రెడ్డి

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ఊర్కొండ మండల కేంద్రంలోని కల్వకుర్తి--జడ్చర్ల ప్రధాన రహదారిపై వెలసిన హాజరత్ సయ్యద్ ఖాజా యూసుఫోద్దీన్ మిర్జాయి చిష్తీ ఖలందరి దర్గాలో నిర్వహిస్తున్న ఉర్సు ఉత్సవాల్లో మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ మాజీ వర్కింగ్ అధ్యక్షులు ధ్యాప నిఖిల్ రెడ్డి పాల్గొన్నారు. ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకుని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ధ్యాప నిఖిల్ రెడ్డి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు ధ్యాప నిఖిల్ రెడ్డిని పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో, శ్రీశ్రీశ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయ పాలక మండలి చైర్మన్ చింతల మనోహర్ రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు రమేష్ నాయక్, నర్సంపల్లి సర్పంచ్ శైలజ శ్రీశైలం, యువజన విభాగం మండల అధ్యక్షులు గుంజ ఆదినారాయణ, కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఉర్సు ఉత్సవాల సందర్భంగా దర్గాకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో కొనసాగింది.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి 'పాలమూరు టు ప్రజాభవన్' పాదయాత్ర

**ఈ నెల 10న పాదయాత్రకు అనుమతి ఇవ్వాలి.. పోలీస్ ప్రొటెక్షన్ కల్పించాలి**

**జిల్లా ఎస్పీ దరావత్ జానకి కి వినతి పత్రం.. సానుకూలంగా స్పందించిన ఎస్పీ**

**అగ్నిధార న్యూస్ అక్టోబర్ 03**



మహబూబ్‌నగర్ ఏళ్ల తరబడి జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్న వర్కింగ్ జర్నలిస్టుల ఇళ్ల సమస్యను పరిష్కరించడంతో పాటు తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 10న నిర్వహించనున్న 'పాలమూరు టు ప్రజాభవన్' పాదయాత్రకు అనుమతి, పోలీస్ బందోబస్తు కల్పించాలని టీ డబ్ల్యూ జే ఎఫ్ జర్నలిస్టులు జిల్లా ఎస్పీ దరావత్ జానకిని కోరారు. పాదయాత్రకు పోలీసుల అనుమతి కోరుతూ శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జర్నలిస్టుల ప్రతినిధి బృందం ఎస్పీకి వినతి పత్రం అందజేసింది. జర్నలిస్టుల సమస్యలను వివరించి, ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా పాదయాత్ర నిర్వహించనున్నామని తెలిపారు.

### ఏళ్లుగా ఎదురుచూపులే.. సొంతింటి కోసం పోరాటం:

ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మంగళగిరి యాదగిరి మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా జర్నలిజం వృత్తిలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల్లో చాలామందికి ఇప్పటికీ సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టుల ఇళ్ల సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే వివిధ దశల్లో పోరాటాలు నిర్వహించినప్పటికీ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని తెలిపారు. ఈ నేపథ్యంలోనే పాలమూరు నుంచి ప్రజాభవన్ వరకు పాదయాత్ర నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి జర్నలిస్టుల సమస్యలను నేరుగా తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు వివరించారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా పాదయాత్ర నిర్వహిస్తామని, ఇందుకు అవసరమైన అనుమతులు మంజూరు చేసి సహకరించాలని ఎస్పీని కోరారు. పాదయాత్రకు నగర ప్రజలు, మేధావులు, ప్రజా సంఘాలు, వివిధ వర్గాల నుంచి మద్దతు కోరనున్నట్లు తెలిపారు.

### జర్నలిస్టుల భద్రతకు పోలీస్ ప్రొటెక్షన్ అవసరం:

జాతీయ కమిటీ సభ్యులు పసుపుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులతో పాటు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొందరు జర్నలిస్టులు అనారోగ్యంతో మృతి చెందిన సందర్భాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. జర్నలిస్టు కుటుంబాల్లో చాలామంది సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టుల ఇళ్ల సమస్య పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో గతంలో చేపట్టిన పోరాటాలను వివరించారు.ప్రస్తుత పాదయాత్ర ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కార మార్గం లభిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పాదయాత్ర సందర్భంగా జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ ప్రొటెక్షన్, అవసరమైన బందోబస్తు కల్పించాలని ఎస్పీ జానకిని కోరారు.

### జర్నలిస్టుల సమస్యలపై ఎస్పీ ఆరా!

జర్నలిస్టుల వినతిపై జిల్లా ఎస్పీ జానకి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల సమస్యపై వివరాలు అడిగి తెలుసుకున్న ఎస్పీ.. "అందరికీ ఇళ్లు వచ్చాయా? ఇంకా ఇళ్లు రాని వారు కూడా ఉన్నారా?" అంటూ జర్నలిస్టులను అడిగి తెలుసుకున్నారు. పాదయాత్ర నిర్వహణ, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై కూడా ఎస్పీ వారితో మాట్లాడినట్లు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న పాదయాత్ర శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తామని జర్నలిస్టు ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మంగళగిరి యాదగిరి, టీజేఎఫ్‌జే జిల్లా కార్యదర్శి మొలకలపల్లి గోపాల్ మహారాజ్, ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కమిటీ సభ్యులు పసుపుల శ్రీనివాస్, ఎం.డి. మోయిజ్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి లింగగళ్ల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్లాబ్ నిర్మాణానికి స్టీల్, సిమెంట్ అందజేత

**ట్రస్ట్ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన నిరుపేద కుటుంబానికి ఇంటి నిర్మాణంలో భాగంగా స్లాబ్ నిర్మాణానికి అవసరమైన స్టీల్, సిమెంట్‌ను ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేశారు.13వ వార్డుకు చెందిన మారేపల్లి శాంతమ్మ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో ఇంటి నిర్మాణాన్ని కొనసాగించలేని పరిస్థితిని గుర్తించిన రాష్ట్ర నాయకులు, మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, స్థానిక మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ తన ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్, స్టీల్‌ను అందించారు.నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, సొంత ఇంటి కలను సాకారం చేసుకునేందుకు ఉప్పల వెంకటేష్ చేస్తున్న సహాయాన్ని కుటుంబ సభ్యులు అభినందించారు. తమ ఇంటి నిర్మాణానికి అవసరమైన నిర్మాణ సామగ్రిని అందించినందుకు ఉప్పల వెంకటేష్‌కు కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఇలాంటి సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఉప్పల వెంకటేష్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో, 13వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ అనూష శ్రీశైలం, 12వ వార్డు కౌన్సిలర్ నాగిళ్ల జగన్ తో పాటు స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దశదిన కర్మలో పాల్గొని నివాళులర్పించిన ద్యాప నిఖిల్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఊర్కొండ మండల కేంద్రానికి చెందిన కీ.శే. శెక్కరి రవి గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన దశదిన కర్మ కార్యక్రమాన్ని శనివారం కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, స్థానిక నాయకుల సమక్షంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ మాజీ వర్కింగ్ అధ్యక్షులు ద్యాప నిఖిల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మృతుడు శెక్కరి రవి గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.మృతుడి కుటుంబానికి ధైర్యం చెప్పిన నిఖిల్ రెడ్డి, రవి గౌడ్ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు రమేష్ నాయక్, నర్సంపల్లి సర్పంచ్ శైలజ శ్రీశైలం, యువజన విభాగం మండల అధ్యక్షులు గుంజ ఆదినారాయణ, నాయకులు లక్ష్మణ్ కుమార్ గౌడ్, సంగప్ప గౌడ్, దారా రాజు తదితరులు పాల్గొని రవి గౌడ్‌కు నివాళులర్పించారు.

## సర్పంచ్ మరణం విషాదకరం..

**కుటుంబ సభ్యులను పరామర్శించిన ద్యాప నిఖిల్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఊర్కొండ మండలంలోని బాల్య లోక్య తండా సర్పంచ్ అంజమ్మ హనుమంతు నాయక్ మామ మన్య నాయక్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ మాజీ వర్కింగ్ అధ్యక్షులు ద్యాప నిఖిల్ రెడ్డి శనివారం బాల్యలోక్య తండాకు చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మన్య నాయక్ మృతి పట్ల నిఖిల్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని ఆకాంక్షించారు.కుటుంబానికి అండగా ఉంటామని, ఎలాంటి అవసరం వచ్చినా తమను సంప్రదించాలని నిఖిల్ రెడ్డి తెలిపారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులతో కొద్దిసేపు మాట్లాడి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ పరామర్శ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు రమేష్ నాయక్, నర్సంపల్లి సర్పంచ్ శైలజ శ్రీశైలం, నాయకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ సహకారంతో స్వచ్ఛ జలధార.. త్రాగునీటి ట్యాంకుల పరిశుభ్రత

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ ప్రజలకు పరిశుభ్రమైన, నాణ్యమైన త్రాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 'స్వచ్ఛ జలధార' కార్యక్రమం రెండవ విడత కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం వెల్దండ మండలం రాచుర్ గ్రామంలో త్రాగునీటి నిల్వ ట్యాంకుల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని త్రాగునీటి నిల్వ ట్యాంకులను ప్రత్యేకంగా శుభ్రపరిచారు. జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సహాయంతో ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించారు.త్రాగునీటి నిల్వ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజలకు నాణ్యమైన త్రాగునీరు అందించడంతో పాటు ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో దశలవారీగా 'స్వచ్ఛ జలధార' కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ,ప్రజల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. త్రాగునీటి ట్యాంకులను శుభ్రపరిచే కార్యక్రమం వల్ల గ్రామ ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

## రెడ్డి మహిళా చైతన్యానికి రాధారెడ్డి కృషి

**రాష్ట్ర కార్యదర్శిగా సి. రాధారెడ్డి నియామకం**

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:**

రెడ్డి మహిళా సేవా సమితి రాష్ట్ర మహిళా విభాగాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా వనపర్తి జిల్లాకు చెందిన సి. రాధారెడ్డికి రాష్ట్ర కార్యదర్శిగా కీలక బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రెడ్డి సేవా సమితి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బి. వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు సంధ్యారెడ్డి చేతుల మీదుగా రాధారెడ్డి నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా రాధారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని రెడ్డి మహిళల్లో ఎంతోమంది విద్యావంతులు ఉన్నప్పటికీ సామాజిక చైతన్య కార్యక్రమాల్లో మరింతగా భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే సమాజ అభివృద్ధిలో కూడా తమ వంతు పాత్ర పోషించాలని అన్నారు.మహిళల ఆరోగ్యం, వారి సమస్యలు, కుటుంబ పోషణలో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అవగాహన కల్పించడంతో పాటు మహిళా సాధికారత కోసం కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా దేశ భవిష్యత్తు అయిన యువతను చెడు మార్గాలకు దూరంగా ఉంచి, మంచి మార్గంలో నడిపించడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.రాష్ట్ర అధ్యక్షులు, మహిళా విభాగం అధ్యక్షురాలి సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి మహిళలను చైతన్యపరిచి, రెడ్డి మహిళా సేవా సమితిని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని రాధారెడ్డి తెలిపారు.కార్యక్రమంలో సుధారెడ్డి, పావనిరెడ్డి, లావణ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాధారెడ్డికి రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించడంపై వనపర్తి జిల్లా మహిళలు హర్షం వ్యక్తం చేశారు.



## సంగాపూర్ రింగ్ రోడ్, క్యాసారం, కోట మైసమ్మ రోడ్లను వెంటనే పూర్తి చేయాలి

**ఆర్ డి ఓ , ర్ ఆర్ అండ్ బి అధికారులతో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న సంగాపూర్ రింగ్ రోడ్, క్యాసారం రోడ్, కోట మైసమ్మ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ ఆర్ డి ఓ వి.వి.ఎల్. చంద్రకళతో పాటు ఆర్ అండ్ బి శాఖ అధికారులతో చర్చ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రింగ్ రోడ్ పనులు అసంపూర్తిగా ఉండటంతో భారీ వాహనాలు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణంలోకి ప్రవేశిస్తున్నాయని, దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడటంతో పాటు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం దృష్ట్యా రింగ్ రోడ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.అదేవిధంగా త్వరలో బతుకమ్మ, దసరా పండుగలు రానున్న నేపథ్యంలో పట్టణానికి వచ్చే ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యాసారం రోడ్డు, కోట మైసమ్మ రోడ్డు పనులను కూడా వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులను కోరారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు పండుగల సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి డిప్యూటీ ఈఈ ఎ. రేణుక , డి.ఈ నికిత ఆర్అండ్ బి శాఖ సిబ్బంది, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కళ్యాణ్కర్ పద్మాబాయి నర్సింగ్, ఒకటో వ వార్డు కౌన్సిలర్ కప్పు మమత పోచయ్య మాజీ చైర్మన్ రాజమౌళి ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయమే టీ ఆర్ ఎస్ పార్టీ ధ్యేయం

**టీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు టీ ఆర్ ఎస్ పార్టీ గజ్వేల్ ఇంచార్జి కొట్టాల యాదగిరి**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

జగదేవపూర్ మండలం లోని స్థానిక ఎల్లమ్మ టెంపుల్ నుండి టీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ర్యాలీ గా అంబేద్కర్ చౌరస్తా వరకు నిర్వహించి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ జెండాను టీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి హాజరైయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఐ గాని కాంగ్రెస్ గాని బిజెపి కి గాని సామాజిక న్యాయం లేదని సామాజిక న్యాయం కావాలంటే టిఆర్ఎస్ పార్టీ కవితక్కతో మాత్రమే సాధ్యం అవుతుందని పాంచ జన్య సూత్రాలతో కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించామని ఉచిత విద్య ఉచిత వైద్యం వ్యవసాయం ఉపాధి సామాజిక న్యాయం తెలంగాణ రాష్ట్రానికి ఇవి చాలా అవసరమని తెలంగాణ రాష్ట్రం వచ్చినట్టయితే బతుకులు బాగుపడతాయని బడుగు బలహీన వర్గాలు బహుజనులు ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలు అగ్రవర్ణ పెదల బతుకులు బాగుపడతాయని ఆశించామని అనుకున్నాం కానీ బంగారు తెలంగాణ ని బడబడ మాటల చెప్పి బడా బాబుల తెలంగాణ చేసిన విషయం మన అందరికీ తెలుసు కేవలం కొంతమందికి మాత్రమే బంగారం అయింది తప్ప బహుజనులకు మాత్రం బంగారు తెలంగాణ రాలేదని ఈ బంగారు తెలంగాణ మాకొద్దు అని బహుజన తెలంగాణ ముద్దు నినాదంతో కొత్త రాజకీయ పార్టీని స్థాపించమని అన్నారు.ఈ కార్యక్రమంలో బొగ్గుల చందు కె రమేష్ బి స్వామి బి. శ్రవణ్ ఎం. ప్రశాంత్ బి. సత్తయ్య రమేష్ కిష్టయ్య రాజు కె. కృష్ణ బన్నీ తదితరులు టీ ఆర్ ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గర్గుల్‌లో ఘనంగా అవతార్ మెహర్ బాబా సెంటర్ 34వ వార్షికోత్సవ వేడుకలు

**ప్రేమ, సత్య సందేశాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు**

**కామారెడ్డి :** కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలోని అవతార్ మెహర్ బాబా సెంటర్ 34వ వార్షికోత్సవ వేడుకలను అక్టోబర్ 4న భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మెహర్ బాబా బోధించిన ప్రేమ, సత్యం, సేవ, ఆధ్యాత్మికత వంటి సందేశాలను ప్రజలకు చేరవేసేలా రోజంతా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వార్షికోత్సవ వేడుకలు ఉదయం 7 గంటలకు పుష్పమాల అలంకరణ, ప్రార్థన, హారతి కార్యక్రమాలతో ప్రారంభమవుతాయి. ఉదయం 7.15 గంటలకు ధుని కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం 7.30 గంటలకు సప్తవర్ణ పతాకావిష్కరణ కార్యక్రమం ఉంటుంది. 7.45 గంటలకు భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 8.30 గంటలకు మెహర్ బాబా పల్లకి సేవ నిర్వహించనున్నారు. అనంతరం 10.15 గంటలకు వేదికపై స్వాగత ఉపన్యాసం ఉంటుంది. 10.20 గంటలకు గర్గుల్ సెంటర్‌కు చెందిన భక్తులు భజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 10.30 గంటల నుంచి వివిధ మెహర్ బాబా కేంద్రాలకు చెందిన ప్రేమికులు భజనలు, ఆధ్యాత్మిక గీతాలు ఆలపించడంతో పాటు ప్రేమ, సత్యం, ఆధ్యాత్మిక జీవన విధానం వంటి అంశాలపై సందేశాలను అందించనున్నారు. ఈ సందర్భంగా మెహర్ బాబా బోధనలు, మానవత్వం, ప్రేమ, సత్యం, సేవా భావం వంటి విలువలను గుర్తుచేసుకుంటూ భక్తులు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. వివిధ ప్రాంతాల నుంచి మెహర్ బాబా ప్రేమికులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. మధ్యాహ్నం 1.15 గంటలకు కార్యక్రమానికి సంబంధించిన ప్రకటనలు,

## పుట్టినరోజు వేడుకలకు హంగు, ఆర్భాటాలు వద్దు

**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:**



వ్యవసాయ సంక్షోభం, రైతుల కష్టాలు, ప్రజల ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో తన పుట్టినరోజు వేడుకలను హంగు, ఆర్భాటాలు లేకుండా సామాజిక సేవా కార్యక్రమాలతో నిర్వహించాలని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాలు, వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కేక్ కటింగ్‌లు, శాలువాలు, బొకేలు, పూలమాలలు, స్వీట్లు తీసుకురావద్దని పార్టీ శ్రేణులు, అభిమానులు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## ప్రోటోకాల్ పాటించకుండా చెక్కు పంపిణీ

**కలెక్టర్ కు సర్పంచ్ ఫిర్యాదు.**

**అగ్నిధార న్యూస్ కమన్పూర్**



కమాన్పూర్ మండలం గుండారం గ్రామ పంచాయతీలో ప్రోటోకాల్ మిస్సింగ్ వ్యవహారం చోటుచేసుకుంది.గుండారం గ్రామ శివారు రాజాపూర్ కు చెందిన రైతు గడ్డి ముత్యాలు కు చెందిన ఎద్దు గత తేది 19-01-2026న విద్యుత్ షాక్ తో మృతి చెందగా, దానికి నష్టపరిహారంగా ఎన్పీడీసీఎల్ సంస్థ 40,000/- రూపాయల చెక్కును మంజూరు చేసింది.అయితే ఈ చెక్కును తేది 01-10-2026న గ్రామ పంచాయతీకి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, సర్పంచ్ కు ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానం లేకుండా పంపిణీ చేసి, మీడియా ద్వారా ప్రచారం చేసుకున్నారని గుండారం సర్పంచ్ జంగిలి పోచాలు ఆరోపించారు. గ్రామ పంచాయతీని, సర్పంచ్ ను కించపరిచే విధంగా వ్యవహరించిన అధికారులపై విచారణ జరిపించాలని, భవిష్యత్తులో అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో గ్రామ పంచాయతీ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ అరుణ శ్రీ కి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు.

## పుట్ట మధు పరామర్శ



**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్**

కమాన్ పూర్ మండల కేంద్రంలోని బాపూజీ నగర్ లో గోపాల లక్ష్మీ ఇటివల మరణించగ వారి కుటుంబ సభ్యులను శనివారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట బీ. ఆర్. ఎస్ నాయకులు ఉన్నారు.

## పశువులకు గర్భకోశ చికిత్స శిబిరం

**పశు వైద్యాధికారి టీ. రామచందర్**

**కామారెడ్డి :** గొల్లపల్లి గ్రామంలో పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి పశువులకు గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించడం జరిగింది. మండల పశు వైద్యాధికారి డాక్టర్ టి.రామ్ చందర్ మాట్లాడుతూ పాడి పశువులలో వచ్చే గర్భకోశ వ్యాధులు, వాటి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు

# మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు**

**ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి**

అగ్నిధార న్యూస్ సుల్తానాబాద్



సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ గ్రామంలో శనివారం రోజున స్వశక్తి సంఘాల మహిళల ఆధ్వర్యంలో సుమారు రూ.1.15 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన చైతన్య జ్యోతి పెట్రోల్ బంక్ ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మరియు ప్రజాప్రతినిధులు, మహిళా సోదరిమనులతో కలిసి ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ...మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. మహిళల ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్లు, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ పంపులు ఏర్పాటు చేయడంతో పాటు చిన్న దుకాణాలు, టిఫిన్ సెంటర్లు, స్కూల్ యూనిఫామ్‌ల కుట్టు కేంద్రాలు తదితర రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. చేసుకునేమహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో స్వశక్తి సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని ప్రభుత్వ విప్ తెలిపారు. వడ్డీలేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని చెప్పారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు 15,715 స్వశక్తి సంఘాలకు రూ.33.42 కోట్ల మేర రుణాలు అందించామని వివరించారు. మహిళా స్వశక్తి సంఘాల సభ్యులకు బీమా భరోసా కూడా కల్పిస్తున్నామని తెలిపారు. గతంలో సహజ మరణానికి రూ.30 వేల వరకు, ప్రమాద మరణానికి రూ.70 వేల వరకు బీమా సౌకర్యం ఉండేదని, అనంతరం ఈ పథకం నిలిచిపోయిందని చెప్పారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం సహజ మరణం సంభవించిన మహిళలకు రూ.2 లక్షల రుణ బీమా, ప్రమాదవశాత్తు మరణించిన మహిళలకు రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తోందన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు 99 మంది మహిళలు సహజ మరణం చెందగా వారి కుటుంబాలకు రూ.75 లక్షల మేర రుణ బీమా ప్రయోజనం అందించామని, ఆరుగురు మహిళలు ప్రమాదవశాత్తు మరణించగా వారి కుటుంబాలకు రూ.60 లక్షల ప్రమాద బీమా అందించామని ప్రభుత్వ విప్ తెలిపారు. ప్రతి మహిళా సమావేశంలో ఈ వివరాలను తెలియజేసి, ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ×ఖూ కేంద్రాలను స్వశక్తి సంఘాల మహిళలు నిర్వహిస్తున్నారని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలని అన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని, ×ఖూ కేంద్రాల నిర్వహణలో ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా సూపర్ ఎల్‌నినో పరిస్థితులు ఉన్నాయని, దీంతో నీటి లభ్యతపై ప్రభావం పడుతోందని ప్రభుత్వ విప్ తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో మంచి వర్షపాతం నమోదైనప్పటికీ గత సంవత్సరాలతో పోలిస్తే ప్రస్తుతం నీటి లభ్యత తక్కువగా ఉందన్నారు. ఇతర జిల్లాల్లోని చిన్న చెరువుల్లో కూడా నీటి లభ్యత తక్కువగా ఉందని తెలిపారు. గత యాసంగిలోనే గ్రామాల్లోని చెరువులను నింపేందుకు ప్రభుత్వం నీటిని విడుదల చేసిందని తెలిపారు. ఈ యాసంగిలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని ప్రభుత్వ విప్ సూచించారు. ఆయిల్‌పామ్, కూరగాయలు, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేసుకోవాలని కోరారు. వచ్చే సంవత్సరం సమృద్ధిగా వర్షాలు కురిస్తే వరి సాగు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, పాలకవర్గం సభ్యులు మరియు జిల్లా లైబ్రరీ చైర్మన్ మార్కెట్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్ మరియు డీఆర్డీఓ కలిందిని, అడిషనల్ డిఆర్డిఓ రవీందర్, పలు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్ లు మరియు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు మరియు సంబంధిత అధికారులు, స్వశక్తి సంఘాల మహిళలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సెల్ఫ్ గోల్ రాజకీయంతో రేవంత్

**హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ మత రాజకీయాలను సరికొత్త కోణంలో ప్రమాదకరమైన ప్రయోగానికి తెరలేపింది. భారతీయ జనతా పార్టీ సుదీర్ఘకాలంగా నిర్మించుకుంటూ వస్తున్న హిందూత్వ ఓటు బ్యాంకుకు విరుగుడు కనిపెట్టే ఆత్రుతలో కాంగ్రెస్ నాయకత్వం సరికొత్త వివాదాలకు ఆజ్యం పోస్తోంది. గతంలో పార్లమెంట్‌లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భగవాన్ శివుడి చిత్రాన్ని ప్రదర్శిస్తూ ప్రసంగించిన బాటలోనే.. తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వేదికగా ఆర్య-ద్రావిడ వాదాన్ని, శైవం-వైష్ణవం పేరిట దేవుళ్లకే వర్గ విభజన ఆపాదిస్తూ చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. రాముడు ధనికుల దేవుడు-శివుడు పేదల దేవుడు.. ఉత్తరాది వారు ఆర్యులు, దేవుడిగా రాముడిని కొలిస్తే.. దక్షిణాది వారమైన మేము ద్రావిడులం, శివుడిని ఆరాధిస్తాం.. బీజేపీ రాముడిని హైజాక్ చేసింది అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి. ఒక రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి, హిందూ దైవ కుటుంబంలో అత్యంత ప్రధానమైన శ్రీరాముడు, పరమశివుడి మధ్య పేద, ధనిక అంతరాలను సృష్టించడం విపరీతమైన విమర్శలకు దారితీసింది. ప్రాంతీయంగా ద్రావిడ వాదాన్ని ఎత్తుకుంటూనే, దైవ భావనకు కూడా వర్గ పోరాటం రంగు పులమడం కాంగ్రెస్ అనుసరిస్తున్న నూతన రాజకీయ విభజన వ్యూహానికి నిదర్శనమని భావిస్తున్నారు. హిందూ సమాజంలో చారిత్రకంగా అనేక సంప్రదాయాలు ఉన్నప్పటికీ, రాముడు, శివుడు అనే వ్యత్యాసాలు లేకుండా హరిహరులు గా కలిసి ఆరాధించే సంస్కృతి భారత్‌లో ఉంది. ముఖ్యంగా తెలంగాణలోనే భద్రాచలం శ్రీరాముడిని దక్షిణ అయోధ్య గా, వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దక్షిణ కాశీ గా



సమానంగా పూజిస్తారు. ఇటువంటి పుణ్యక్షేత్రాలు ఉన్న ప్రాంతానికి చెందిన నేతలే.. రాజకీయ ప్రయోజనాల కోసం దేవుళ్లను ఉత్తర-దక్షిణ భాగాలుగా, ధనిక-పేద వర్గాలుగా విభజించడం వెనుక క్షేత్రస్థాయిలో రాజకీయ లబ్ధి పొందాలనే ఆరాటం స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా హిందూ సంప్రదాయాలను విభజించడం ద్వారా బీజేపీ ఏకీకృత హిందూ ఓటు బ్యాంకును దెబ్బతీయవచ్చని అంచనా వేస్తోంది. వ్యూహాత్మకంగా కాంగ్రెస్ వేస్తున్న ఈ అడుగులు ఆ పార్టీకే రివర్స్ అయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఇటువంటి భక్తి, విశ్వాసాల కేంద్రంగా జరిగే విభజన రాజకీయాలు ఆఖరికి బీజేపీకే రాజకీయంగా అత్యధిక ప్రయోజనాన్ని చేకూరుస్తాయి. హిందూ దేవుళ్లను రాజకీయాల్లోకి లాగి, వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా మెజారిటీ ఓటర్లలో కాంగ్రెస్‌పై ప్రతికూల భావన ఏర్పడేలా చేయడం బీజేపీకి చాలా సులభమవుతుంది. ఈ వ్యాఖ్యలను అస్త్రంగా చేసుకుని కాంగ్రెస్ హిందూ వ్యతిరేక సిద్ధాంతాన్ని, నకిలీ సెక్యులరిజాన్ని పాటిస్తోంది అని బీజేపీ విస్తృతంగా ప్రచారం చేయడానికి అవకాశం లభిస్తుంది. హిందూత్వను నేరుగా ఎదుర్కోలేక, దానిని ముక్కలు చేసేందుకు శివుడు లబ రాముడు, ఉత్తరాది లబ దక్షిణాది సమీకరణాలు తేవడం వల్ల పోలరైజేషన్ జరుగుతుంది. ఇది కాంగ్రెస్‌కు ఉన్న లౌకిక లేదా తటస్థ ఓటర్లను కూడా దూరం చేసే ప్రమాదం ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తన ప్రాచీన ధార్మిక క్షేత్రాల పునర్నిర్మాణం ద్వారా ఇప్పటికే ఉత్తర-దక్షిణ తేడా లేకుండా విశ్వాసులలో స్థానం సంపాదించుకుంది. కాబట్టి దేవుళ్లను విభజించే యత్నం సాధారణ భక్తుల్లో ఆగ్రహాన్ని కలిగించి, ఓట్ల రూపంలో బీజేపీ వైపే దారితీస్తుందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ హిందూత్వ సిద్ధాంతానికి విరుగుడుగా తెస్తున్న ఈ విభజన కౌంటర్ వ్యూహం సెల్ఫ్ గోల్ అయ్యే అవకాశాలే ఎక్కువ. విశ్వాసాలను రాజకీయం చేసి, దేవుళ్లకు వర్గ భేదాలు ఆపాదించడం ద్వారా కాంగ్రెస్ సాధించేదనకంటే కోల్పోయేదే ఎక్కువని తెలంగాణ రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. భావజాల పరంగా స్పష్టమైన ప్రత్యామ్నాయాన్ని ప్రజల ముందు ఉంచకుండా, ఇటువంటి సున్నితమైన అంశాలను కెలికితే అది బీజేపీ నేతృత్వంలోని పోలరైజేషన్ వ్యూహానికి మరింత నెయ్యి పోసినట్లే అవుతుందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

# ఫాం హౌస్ సర్వేపై ఉత్కంఠ

**హైదరాబాద్ :** కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ భూముల అంశం కేంద్రబిందువుగా మారింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, వెలికట్ట గ్రామాల పరిధిలో కేసీఆర్ ఫాంహౌస్‌ను ఆనుకుని ఉన్న భూముల సర్వే ప్రక్రియ పూర్తికావడం చర్చనీయాంశమైంది. రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన ఈ సమగ్ర సర్వే నివేదిక సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతికి చేరింది. దీంతో.. ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. కేసీఆర్ ఫాంహౌస్ లో అసైన్డ్ ల్యాండ్స్ ఉన్నాయని.. వాటిపై 30 రోజుల్లోగా సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఆదేశించారు. మర్కూక్ మండల పరిధిలోని భూముల లెక్కలు తేల్చాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం కదిలింది. ఎర్రవల్లి సర్వే నంబర్ 325 పరిధిలోని సుమారు 388 ఎకరాలు, వెలికట్ట సర్వే నంబర్ 271 భూములపై అధికారులు సర్వే నిర్వహించారు. శాటిలైట్ మ్యాపింగ్, జియో ట్యాగింగ్, డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సర్వే వంటి ఆధునిక పద్ధతులను ఉపయోగించి హద్దులను నిర్ధారించారు. ఈ సర్వేలో భాగంగా ఎర్రవల్లిలో 244 మందికి, వెలికట్టలో 118 మందికి పైగా నోటీసులు జారీ చేసి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ఈ సర్వే రాజకీయంగానే కాకుండా



స్థానికంగానూ అనేక మలుపులు తిరుగుతోంది. ముఖ్యంగా శివారు వెంకటాపూర్ గ్రామస్థులు అధికారుల ముందుకొచ్చారు. తమ గ్రామానికి చెందిన సుమారు 180 ఎకరాల భూములు ఎర్రవల్లి సర్వే నంబర్ 325లో కలిసిపోయాయని, పాత రికార్డుల ఆధారంగా న్యాయం చేయాలని వారు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. మరోవైపు, దశాబ్దాలుగా ఆ భూములను సాగు చేసుకుంటున్న చిన్న సన్నకారు రైతులు తమ పట్టా పాస్‌బుక్కులు చూపించినప్పటికీ, ప్రభుత్వ తాజా నిర్ణయాలు తమను ఏ విధంగా ప్రభావితం చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. పదేళ్లపాటు సీఎంగా ఉన్న కేసీఆర్ ఫాంహౌస్ చుట్టూ ఉన్న భూముల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఒకవేళ ఈ సర్వే నివేదికలో భూ ఆక్రమణలు జరిగినట్లు లేదా నిబంధనలకు విరుద్ధంగా భూ బదలాయింపులు జరిగినట్లు తేలితే, అది కేసీఆర్‌తో పాటు బీఆర్‌ఎస్‌ను ఇరుకున పెట్టే అవకాశం ఉంది. అధికార కాంగ్రెస్ పార్టీ దీనిని రాజకీయ అస్త్రంగా మలుచుకుంటుంది. అయితే రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఈ సర్వే చేపట్టారని గులాబీ శ్రేణులు మండిపడుతున్నాయి. కలెక్టర్ అందజేయనున్న ఈ తుది నివేదికను ప్రభుత్వం పరిశీలించి ఎలాంటి చర్యలకు ఉపక్రమిస్తుందనేది ఆసక్తి రేపుతోంది. కేసీఆర్ కు నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అదే జరిగితే రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మరో మలుపు తిరిగే అవకాశముంది.

## అమెరికాలో విషాదం..

## అనారోగ్యంతో నల్గొండ యువతి మృతి

**మిర్యాలగూడ :** ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెలుగు యువతి తీవ్ర అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. క్యాన్సర్ మహమ్మారితో పోరాడి కన్నుమూసింది. నల్గొండ జిల్లా వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన బాధితురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పీఏసీఎస్ సల్కునూరు మాజీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కందిమల్ల లక్ష్మిరెడ్డి, పద్మ దంపతుల చిన్న కుమార్తె మాన్విత రెడ్డి (26) హైదరాబాద్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఉన్నత చదువుల కోసం 2023లో అమెరికా వెళ్లింది. స్నేహితులతో కలిసి ఉంటూ ఎంఎస్ పూర్తి చేసింది. ఈ క్రమంలో ఆమె అనారోగ్యానికి గురైంది. సెప్టెంబర్ 4న అకస్మాత్తుగా తీవ్ర గొంతు నొప్పితో అనారోగ్యానికి గురికావడంతో స్నేహితులు ఆమెను బాల్టిమోర్‌లోని దవాఖానలో చేర్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు నాలుగో దశ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు. సెప్టెంబర్ 13న చికిత్స కోసం దవాఖానలో ఇన్ పేషెంట్‌గా చేర్చుకున్నారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ క్రమంలో ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్టోబర్ 1న మాన్వితారెడ్డి మృతిచెందింది.

## ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి తల్లి ఆత్మహత్య

**వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలో విషాద ఘటన**

**వికారబాద్** మాటుగూడలో కుటుంబ కలహాల నేపథ్యంలో శుక్రవారం ఉదయం భర్త రాజుతో గొడవ పడి కూతురు జనశ్రీ (8), కుమారుడు సాకేత్ (4)లను తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయి సోమనుర్తి శివారులోని వ్యవసాయ బావిలో దూకి శవమై భార్య మమత (30) కనిపించింది. ఇద్దరి మృతదేహాలను బయటకు తీయగా, సాకేత్ కోసం పోలీసులు గాలిస్తుననారు.

## శ్రీసిటీలో ఘోర ప్రమాదం.. నలుగురు మృతి

తిరుపతి : తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో శనివారం భారీ పేలుడు సంభవించింది. టిల్ హెల్త్కేర్ పరిశ్రమలో బాయిలర్ ఒక్కసారిగా పేలడంతో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. పరిశ్రమలోని నిర్మాణాలు, ఇనుప సామగ్రి, పైపులు, ఇతర పరికరాలు దెబ్బతిన్నాయి. ఘటనాస్థలంలో భారీగా శిథిలాలు చెల్లాచెదురుగా పడ్డాయి. శిథిలాల కింద పలువురు కార్మికులు చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో మృతిచెందిన వారు, గాయపడిన వారి వివరాలు, వారి స్వస్థలాలు, క్షతగాత్రుల పరిస్థితిపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. అలాగే బాయిలర్ పేలుడుకు గల అసలు కారణం ఏమిటన్న దానిపై అధికారులు పరిశీలన చేస్తున్నారు.

## చేనేత వస్త్రప్రదర్శనను ప్రారంభించిన సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన

**హైదరాబాద్** మన చేనేతకళలను మనమే ప్రోత్సహించాలని, చేనేత వస్త్రాలు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా భాధ్యతగా ధరించాలని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి.సృజన అన్నారు. శ్రీనగర్ కాలనీ సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరుతో ఏర్పాటుచేసిన చేనేత వస్త్రప్రదర్శనను ఆమె ప్రారంభించారు. దసరా, బతుకమ్మ, దీపావళితో పాటు పలు శుభకార్యాలకు అనువుగా ఇక్కడ చేనేత కళాకారుల చీరలు కొలువుదీరాయని, చేనేత కళాకారులకు మరింత ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా చేనేత వస్త్రకళలు నిలుస్తాయని, భారతీయ వస్త్రాలకు అంతర్జాతీయంగా ప్రాచుర్యం ఉందన్నారు. చేనేతకారులకు మరింత ప్రోత్సాహం అందించడానికి, వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేసిన నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్‌కుమార్‌ల కృషిని అభినందించారు. వస్త్రప్రదర్శనలోని వస్త్రాలను తిలకించి చేనేతకారులను ప్రశంశించారు. ప్రముఖ నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ వస్త్రాలను సుమారుగా 80స్టాల్స్ ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల11వరకు ఈ ఎగ్జిబిషన్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు.

## హ్యాండీ క్రాఫ్ట్ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం

**హైదరాబాద్ :** దేశంలోని వివిధ రాష్ట్రాల సంప్రదాయ చేనేత వస్త్రాలు, హస్తకళలను ఒకే చోటఅందుబాటులో ఉంచడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు .హైదరాబాద్ మోతీ నగర్ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్ లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళాను నిర్వహకులతో కలిసి ఆయన ప్రారంభించారు. చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్ర ఉత్పత్తులు, హస్తకళాకారులు తయారు చేసిన హ్యాండీ క్రాఫ్ట్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. దసరా, బతుకమ్మ, దీపావళి పండుగలను పురస్కరించుకుని మంగళగిరి ,ఉప్పాడ, వెంకటగిరి ,భాగల్ పూర్ శారీస్ తో పాటు డిజైనర్ వేర్ ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉంచామని నిర్వహకులు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ వచ్చే నెల ఒకటో తేదీ వరకు కొనసాగుతుంది . దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన బ్రాండెడ్ వస్త్ర ఉత్పత్తులు వీవర్స్ టు కస్టమర్ కు అందిస్తున్నట్లు నిర్వహకులు మహ్మద్ సాబేర్ అలీ ,అక్బర్ అలీ తెలిపారు. ప్రతి రోజు ఉదయం పది నుండి రాత్రి పది వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందన్నారు

## అక్టోబర్ 10-18 వరకు

## ఘనంగా బతుకమ్మ వేడుకలు

**18న సద్దుల బతుకమ్మ ట్యాంక్బండ్పై భారీ వేడుకలు**

**హైదరాబాద్** ఈ నెల పది నుంచి 18 వరకు బతుకమ్మ వేడకలు అధికారికంగా జరగనున్నాయి. 18 న సద్దుల బతుకమ్మ ట్యాంక్ బండ్ పై జరగనుంది. ఈ సాయంత్రం 4 గంటలకు అమరవీరుల స్మారక స్తూపం నుంచి భారీ మహిళల బతుకమ్మ ర్యాలీ వుంటుంది. 5?10 గంటల వరకు ట్యాంక్బండ్పై ప్రధాన వేడుకలు జరుగుతాయి. ట్యాంక్బండ్పై వేలాది మంది మహిళలతో సద్దుల బతుకమ్మ నిర్వహించనున్నారు. ట్రాఫిక్ డైవర్షన్లు, బారికేడింగ్, లైటింగ్, ఇతర మౌలిక సౌకర్యాలకు ఏర్పాట్లు, బతుకమ్మ ఘాట్, నెక్లెస్ రోడ్డులో నిమజ్జన ఏర్పాట్లు, హైదరాబాద్లో ప్రధాన కూడళ్లకు బతుకమ్మలు, విద్యుత్ అలంకరణ, రవీంద్రభారతిలో 10 రోజుల పాటు బతుకమ్మ ఉత్సవాలు జరగనున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన పర్యాటక ప్రాంతాల్లోనూ వేడుకలు నిర్వహిస్తారు. బతుకమ్మ ప్రత్యేక లోగో రూపకల్పన; తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ అంశం కూడా అందులో పొందుపరచనున్నారు.

## దేవాలయాలపై దాడులను అపేలా చర్యలు తీసుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాలి

**హైదరాబాద్:** దేవాలయాలపై జరుగుతున్న దాడులను అపేలా చర్యలు తీసుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, ఈ చిచ్చును ఆపాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపైనే ఉందని ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషిమాత దేవాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..."ఒక సైకో, ఒక ఉన్మాది సంతోషిమాత దేవాలయంలో దాడి చేశాడు. ఈ దాడి మొదటిది కాదు, ఇప్పటికే 20 ఆలయాలకు పైగా దాడులు జరిగాయి. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు, మన హృదయాలను గాయపరుస్తున్నారు. సీఎం కుర్చీలో కూర్చున్న రేవంత్ రెడ్డి 'నా పేరు రేవంత్ రెడ్డి కాదు, రేవంతుద్దీన్' అని చెప్పుకుంటున్నారు. మీరు మతం మార్చుకోండి, మాకేం అభ్యంతరం లేదు; కానీ, అన్ని మతాలను సమానంగా చూడాల్సిన బాధ్యత ఉందని మర్చిపోవద్దు. ధార్మిక సంస్థలలో మత ప్రబోధకుల ప్రోత్బలంతోనే ఈ దాడులు జరుగుతున్నాయి.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com